ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



జగిత్యాల జిల్లా వార్తలు

5★★

గురువారం 10 జులై 2025

అభివృద్ధికి దూరంగా శివారు కాలనీలు
● ఇబ్బందులు పడుతున్న పట్టణవాసులు
● వార్డుల పునర్విభజన చేసి సమస్యలు పరిష్కరించాలని వినతి 8

ఉపాధ్యాయులకు యేటా ప్రమోషన్లు ఇవ్వాలి
● తపస్ రాష్ట్ర సహాధ్యక్షుడు నరేందర్‌రావు 6

'ఫార్మర్ రిజిస్ట్రీ' అంతంతే..

● వ్యవసాయ పనుల్లో రైతులు బిజీ
● నమోదు ప్రక్రియకు ముందుకు రాని కర్షకులు
● జిల్లాలో 34.38 శాతమే పూర్తి



రాయికల్‌లో ఫార్మర్ రిజిస్ట్రీ చేస్తున్న వ్యవసాయ అధికారి

జగిత్యాల, జూలై 9 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో ఫార్మర్ రిజిస్ట్రీ నామమాత్రంగానే కొనసాగుతోంది. వ్యవసాయ పనుల్లో బిజీగా ఉండడంతో నమోదు చేసుకోవడానికి రైతులు ఆసక్తి చూపడంలేదు. దీంతో ఫార్మర్ రిజిస్ట్రీ ఉద్దేశం నీరు కారుతోంది. వ్యవసాయ అధికారులు క్షేత్రస్థాయిలో రైతు వేదిక, గ్రామపంచాయతీ కార్యాలయాల్లో రైతులకు అందుబాటులో ఉంటూ ఫార్మర్ రిజిస్ట్రీ కోసం ముమ్మర ప్రయత్నాలు చేస్తున్నారు. జిల్లాలో రైతులు ఇప్పటి వరకు 34.38శాతం రిజిస్ట్రీ చేసుకున్నారని అధికారులు చెబుతున్నారు.

● మే 5 నుంచే నమోదు ప్రారంభం...

వ్యవసాయ రంగంలో రైతుల వివరాలను డిజిటల్ రూపంలో నమోదు చేయడానికి వారి భూమి యాజమాన్యం, పథకాల లభ్యత అనుసంధానం చేయడానికి కేంద్ర ప్రభుత్వం ఫార్మర్‌రిజిస్ట్రీ కార్యక్రమాన్ని చేపట్టింది. ఇందులో నమోదు చేసుకున్న రైతులకు ఆధార్‌కార్డు మాదిరి 11 అంకెలతో కూడిన ఐడీని అందిస్తారు. ఈ ప్రక్రియను మే నెల 5నుంచి వ్యవసాయ అధికారులు ప్రారంభించారు. ఆ సమయంలో రైతులు ధాన్యం అమ్మకాలు, కొనుగోలు కేంద్రాలకు వెళ్లడం వంటి పనులు మాత్రమే ఉండడంతో చకాచకా ఫార్మర్ రిజిస్ట్రీ చేసుకున్నారు. అనంతరం వ్యవసాయ పనులు ప్రారంభం కావడంతో రైతులు రిజిస్ట్రీ ప్రక్రియపై ఆసక్తి చూపడం లేదు.

● పథకాలకు ఐడీ కచ్చితం..

ఫార్మర్ రిజిస్ట్రీలో రైతులకు అందించే ఐడీ కీలకంగా మారనుందని వ్యవసాయ అధికారులు చెబుతున్నారు. ఈ ఐడీతోనే రానున్నరోజుల్లో కేంద్ర ప్రభుత్వానికి సంబంధించిన పథకాలు రైతులకు దక్కనున్నాయని అవగాహన కల్పిస్తున్నారు. కేంద్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో చేపట్టనున్న పంటల నమోదు కార్యక్రమంలో ఈ ఐడీని ఉపయోగించనున్నారు. క్షేత్రస్థాయిలో వ్యవసాయాధికారులు గ్రామాల్లోని రైతువేదికలు, గ్రామపంచాయతీ కార్యాలయాల్లో ఫార్మర్ రిజిస్ట్రీపై అవగాహన కల్పిస్తున్నట్లు చెబుతున్నారు. భూమి ఉన్న ప్రతి రైతు తప్పనిసరిగా ఈ ప్రత్యేక రైతు విశిష్ట గుర్తింపు సంఖ్యను పొందాలని సూచిస్తున్నారు. రైతులు తమ పట్టదారు పాస్‌బుక్, ఆధార్‌కార్డు జిరాక్స్‌లను, మొబైల్ నంబర్‌ను వ్యవసాయ విస్తరణ అధికారులకు అందించాలని పేర్కొంటున్నారు. పీఎం కిసాన్ నిధి, ఫసల్ బీమా యోజన, రాష్ట్రీయ కిసాన్ వికాస్ యోజన వంటి పథకాల అమలులో ఐడీ తప్పనిసరిగా అవసరమవుతుందని...

- మిగతా 8లో

జిల్లాలో ఫార్మర్ రిజిస్ట్రీ పరిస్థితి ఇలా...

మండలం	పాసు పుస్తకాల సంఖ్య	ఫార్మర్ రిజిస్ట్రీ శాతం
మేడిపల్లి	6,252	50.06 శాతం
ఇబ్రహీంపట్నం	11,240	47.16 శాతం
ధర్మపురి	16,692	41.78 శాతం
పెగడపల్లి	14,659	39.70 శాతం
జగిత్యాల రూరల్	18,013	39.70 శాతం
మేడిపల్లి	8,964	39.35 శాతం
మల్లాపూర్	16,108	39.17 శాతం
ఎండపల్లి	10,487	38.31 శాతం
రాయికల్	15,730	6.85 శాతం
బుగ్గారం	7,287	36.00 శాతం
కథలాపూర్	13,856	32.84 శాతం
బీర్‌పూర్	8,155	32.69 శాతం
కొడిమ్యాల	13,086	30.65 శాతం
సారంగాపూర్	7,807	30.59 శాతం
కోరుట్ల	14,162	28.32 శాతం
వెల్గటూరు	10,452	27.74 శాతం
మెట్‌పల్లి	17,960	25.90 శాతం
మల్యాల	12,171	25.70 శాతం
జగిత్యాల	5,964	24.95 శాతం
గొల్లపల్లి	17,272	24.50 శాతం

'బేటీ బచావో.. బేటీ పడావో'పై అవగాహన

ధర్మపురి, జూలై 9 (ఆంధ్రజ్యోతి): ధర్మపురి మండలంలోని ముగ్గిడి సోషల్ వెల్ఫేర్ రెసిడెన్సియల్ స్కూల్‌లో జిల్లా మహిళాభివృద్ధి, శిశుసంక్షేమశాఖ ఆధ్వర్యంలో మహిళా సాధికారత బృందం వారిచే బుధవారం బేటీ బచావో బేటీ పడావో అనే అంశంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా లింగ సమానత్వం, లింగ వివక్షత గురించి, మగ పిల్లలకు లింగసమానత్వం యొక్క ప్రాముఖ్యత గురించి వివరించారు. పని ప్రదేశంలో లైంగిక వేధింపులు (నివారణ, నిషేధం, పరిష్కార చట్టం-2013 బేటీ బచావో బేటీ పడావో గురించి వివరించారు. ఆడపిల్లల హక్కుల చట్టాల గురించి వివరించి మహిళా హక్కుల చట్టాలు గురించి తెలిపారు. అనంతరం పాఠశాలలోని పిల్లలకు అవగాహన సదస్సు నిర్వహించారు. కేరీర్లో ఎలా ఎదగాలి అనే వాటి గురించి వివరించారు. సైబర్ నేరాల గురించి, వాటి వల్ల కలిగే అనర్థాల గురించి తెలిపారు. కార్యక్రమంలో ముగ్గిడి టీఎస్‌డబ్ల్యుఆర్‌ఐఈఎస్ స్కూల్ ప్రిన్సిపాల్ రమేష్, జిల్లా మహిళా సాధికారత కేంద్ర బృందం జెండర్ స్పెషలిస్ట్ స్వప్న, గౌతమి, టీచర్లు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



ఫ్లెక్సీని ప్రదర్శిస్తున్న అధికారులు, విద్యార్థులు

'దిశ' సమావేశం వాయిదా

జగిత్యాల, జూలై 9 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని సమీకృత కలెక్టరేట్ కార్యాలయంలో నిర్వహించాల్సిన ఈనెల 9వ తేదీన జిల్లా అభివృద్ధి సమన్వయ మరియు మానిటరింగ్ కమిటీ (దిశ) సమావేశం అనివార్య కారణాల వల్ల వాయిదా పడిందని జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి రఘువరన్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. నిజామాబాద్ ఎంపీ ధర్మపురి అర్వింద్ చైర్మన్‌గా వ్యవహరిస్తున్న దిశ కమిటీ సమావేశం నిర్వహించాల్సి ఉండగా వాయిదా పడిందన్నారు. తిరిగి ఎప్పుడు నిర్వహించేది తర్వాత ప్రకటిస్తామని తెలిపారు.

'విద్యార్థుల సమస్యల పరిష్కారానికి పోరాటం'



ర్యాలీ నిర్వహిస్తున్న ఏబీవీపీ నాయకులు

రాయికల్, జూలై 9 (ఆంధ్రజ్యోతి): విద్యార్థుల సమస్యల పరిష్కారానికి నిరంతరం పోరాటం చేస్తామని ఏబీవీపీ నాయకులు అన్నారు. రాయికల్ పట్టణంలో బుధవారం ఏబీవీపీ ఆవిర్భావ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పట్టణంలోని పాత బస్టాండ్ నుంచి భరతమాత విగ్రహం వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు బన్న హరీష్, పట్టణ కార్యదర్శి గుగ్గిల్ల మనోజ్, కార్యకర్తలు శశి, మనోజ్, రాజు, వంశీ, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

'పెండింగ్ బిల్లులను మంజూరు చేయాలి'

రాయికల్, జూలై 9 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయులకు సంబంధించి ఏడాదిగా పెండింగ్‌లో ఉన్న బిల్లులను ప్రభుత్వం విడుదల చేయాలని తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర బాధ్యులు ఎలిగేటి రాజేంద్రప్రసాద్ డిమాండ్ చేశారు. రాయికల్ పట్టణంతో పాటు మండలంలోని కిష్టంపేట, అల్లీపూర్, ఆలూరు, తాట్లవాయి, భూపతిపూర్ గ్రామాల్లో బుధవారం తపస్ సభ్యత్వ అభియాన్ కార్యక్రమం నిర్వహించారు. తపస్ జిల్లా ప్రధాన కార్యదర్శి బోయినిపెల్లి ప్రసాద్‌రావు మాట్లాడుతూ మెడికల్ రీయింబర్స్‌మెంట్ బిల్లులు, ఉద్యోగం, ఉపాధ్యాయులకు ఆరోగ్య భద్రత కార్డులు అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో తపస్ జిల్లా ఉపాధ్యక్షుడు చెరుకు మహేశ్వర శర్మ, మండల శాఖ అధ్యక్షుడు కొండూరి రజనీకాంత్, ప్రధాన కార్యదర్శి రాచర్ల శ్రీనివాస్, జిల్లా కార్యదర్శి మాదాసు ప్రదీప్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

సార్వత్రిక సమ్మె సక్సెస్





జగిత్యాల జిల్లా కేంద్రంలో ర్యాలీ నిర్వహిస్తున్న కార్మికులు కార్మిక సంఘాల నాయకులు, కోరుట్ల పట్టణంలో కార్మికుల ధర్నా

జగిత్యాల అర్బన్, జూలై 9 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం కార్మిక వ్యతిరేక చట్టాలను రద్దు చేయాలని ఏఐటీయూసీ, సీఐటీయూతో పాటు ఇతర కార్మిక సంఘాల పిలుపు మేరకు చేపట్టిన సమ్మె బుధవారం జిల్లాలో సక్సెస్ అయింది. జిల్లాలోని బీడీ కార్మికులు, ఆశ కార్యకర్తలు, అంగన్‌వాడీలు, గ్రామ పంచాయతీ కార్మికులు, మున్సిపల్ కార్మికులు, హమాలీ కార్మికులు జగిత్యాల కేంద్రానికి వేలాదిగా తరలి వచ్చి ర్యాలీ తీశారు. కార్యక్రమంలో కార్మిక సంఘాల నాయకులు సుతారి రాములు, ముక్రం, ఇందురు సులోచన, చింతా భూమేశ్వర్, మెయిజ్, ఖాజా మెయినొద్దీన్, లక్ష్మీ, ఎం రజిత, గుగ్గిల్ల స్వప్న పాల్గొన్నారు.

●**కోరుట్ల:** పట్టణంలో ఏఐటీయూసీ ఆధ్వర్యంలో కార్మికులు ఆర్డీవో కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. అనంతరం ఆర్డీవో జివాకర్‌కు వినతిపత్రం సమర్పించారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు సుతారి రాములు, కార్మిక సంఘాల నేతలు సాయి కుమార్, గంగారాం పాల్గొన్నారు.

●**మెట్‌పల్లి టౌన్:** ఎల్ఐసీ ఉద్యోగులు సమ్మె చేశారు. ఈ కార్యక్రమంలో ఐసిఇయు అధ్యక్షుడు తిరు కోవెల శ్రీనివాస్, సెక్రటరీ కోటగిరి ప్రభాకర్, బాబు మియా, రత్నాకర్, వాణి, మౌనిక, సదానందం తదితరులు పాల్గొన్నారు.

తడి, పొడి చెత్తను వేరు చేయాలి



ప్రజలకు అవగాహన కల్పిస్తున్న మున్సిపల్ కమిషనర్ రవిందర్

కోరుట్ల, జూలై 9 (ఆంధ్రజ్యోతి): పట్టణ ప్రజలు తడి, పొడి చెత్తను వేరు చేసి మున్సిపల్ వాహనాలకు ఇవ్వాలని కోరుట్ల మున్సిపల్ కమిషనర్ రవిందర్ అన్నారు. కోరుట్ల పట్టణంలో ప్రజలకు బుధవారం తడి, పొడి చెత్త, హానికరమైన చెత్త, హోం కంపోస్టింగ్, 120 మైక్రాన్లకంటే తక్కువ మందం గల ప్లాస్టిక్ వాడకంపై అవగాహన కల్పించారు.

పట్టణంలోని పలు వార్డులలో జరిగిన పారిశుధ్య పనులను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో మెప్మా టీఎంసీ శ్రీరామ్ గౌడ్, ఎన్విరాన్‌మెంటల్ ఇంజనీర్ మహేష్, వార్డు ఆఫీసర్లు, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు బస్సు సౌకర్యం కల్పించాలి



మాట్లాడుతున్న జేఏసీ నాయకులు

జగిత్యాల అర్బన్, జూలై (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లో చదివే బీసీ, ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు ఉచిత బస్సు సౌకర్యం కల్పించాలని బీసీ, ఎస్సీ, ఎస్టీ జేఏసీ నాయకులు బుధవారం అదనపు కలెక్టర్ బీఎస్ లతకు వినతిపత్రం అందించారు. జిల్లాలో అనేక పాఠశాలలు శిథి లావస్థలో ఉన్నాయని వాటిని పడగొట్టి వాటి స్థానంలో కొత్త భవనాలు నిర్మించాలని కోరారు. జిల్లాలో రహదారులన్నీ చెడిపోయి గుంతల మయంగా మారాయని వాటిని పునర్నిర్మాణం చేయాలని, రోడ్లు లేని చోట్ల కొత్త రోడ్లు వేయాలని డిమాండ్ చేశారు. అనంతరం బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి ముసిపట్ల లక్ష్మీనారాయణ మాట్లా డుతూ రాష్ట్ర వ్యాప్తంగా 26 వేలకు పైగా ప్రభుత్వ పాఠశాలలు ఉన్నాయని దానిలో 22 లక్షల మందికి పైగా బడుగు, బలహీనవర్గాల పేద విద్యార్థులు చదువుతు న్నారని పేర్కొన్నారు. వారికి ఉచిత బస్సు సౌకర్యాన్ని కల్పించాలని ఈ సందర్భంగా కోరారు. ఈ కార్యక్రమంలో ఎద లాపురం శ్రీనివాస్, శివ, తిరుపతి, ఉపేంద్ర, బాబు, అశోక్, వెంకటేశ్ పాల్గొన్నారు.

శిథిలావస్థలో ఉన్న పాఠశాల భవనం కూల్చివేత

ధర్మపురి, జూలై 9 (ఆంధ్రజ్యోతి): ధర్మపురి పట్టణంలో శిథిలావస్థలో ఉన్న ప్రభుత్వ జూనియర్ కళాశాల, బాలుర ఉన్నత పాఠశాల భవనాన్ని మున్సిపల్ అధికారులు బుధవారం కూల్చివేశారు. కలెక్టర్ సత్యప్రసాద్ శిథిలావస్థలో ఉన్న కళాశాల, పాఠశాల భవనాన్ని కూల్చివేయాలని సంబంధిత శాఖ అధికారులను ఆదేశించారు. వెంటనే మున్సిపల్ శాఖ అధికారులు కళాశాల ప్రిన్సిపాల్ శైలజ, పాఠశాల హెచ్‌ఎం పెండ్యాల మహేందర్‌తో కలిసి చర్చించారు. అనంతరం జేసీబీ సహాయంతో మున్సిపల్ సిబ్బంది భవనాన్ని కూల్చివేశారు. అలాగే వంద రోజుల ప్రణాళికలో భాగంగా మున్సిపల్ పరిధిలో వన మహోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ధర్మపురి మున్సిపల్ మామిళ్ల శ్రీనివాసరావు, మేనేజర్ బాలె గంగాధర్, శానిటరీ ఇన్స్‌పెక్టర్ చిట్యాల గంగాధర్, మున్సిపల్ సిబ్బంది, వార్డు ఆఫీసర్లు తదితరులు పాల్గొన్నారు.

వన మహోత్సవం

బీర్‌పూర్, జూలై 9 (ఆంధ్రజ్యోతి): ఏక్ పేడ్ మాకే నామ్ కార్యక్రమంలో భాగంగా బుధవారం బీర్‌పూర్ మండలం కొల్వాయి గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో వన మహోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాలలో పండ్లు, పూలు, కూరగాయల చెట్లను విద్యార్థులు ఉపాధ్యాయులు, పోషకులతో కలిసి నాటారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు కొలిచాల సత్యరాజు, సంఘంభట్ల అనురాధ, కేశినేని మౌనిక, గంప కిరణ్ కుమార్, బోయిని చంద్రశేఖర్, వోడ్నాల రాజశేఖర్, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

జిల్లా సమగ్ర అభివృద్ధికి కృషి

● ధర్మపురి క్షేత్రాన్ని తీర్చిదిద్దుతాం..
● ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ సంక్షేమశాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్



మాట్లాడుతున్న మంత్రి లక్ష్మణ్ కుమార్

జగిత్యాల, జూలై 9 (ఆంధ్రజ్యోతి): జిల్లా అభివృద్ధికి ప్రత్యేకకృషి చేస్తున్నామని, అన్నిరంగాల్లో ముందు ఉంచుతామని ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ సంక్షేమశాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ అన్నారు. బుధవారం కలెక్టరేట్ లో జిల్లా అభివృద్ధిపై పలువురు ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ప్రజాప్రతినిధులు, అధికారులతో మంత్రి సమీక్షసమావేశం నిర్వహించారు. సాగునీరు, తాగునీరు, విద్యా, వైద్యము, వ్యవసాయము పౌరసరఫరాలు, ఎస్సీ ఎస్టీ, మైనార్టీ శాఖ,రోడ్లు భవనాల శాఖ ధర్మపురి లక్ష్మీనరసింహస్వామి ఆలయం, కొండగట్టు ఆంజనేయ స్వామి ఆలయ అభివృద్ధితోపాటు వివిధ అంశాలపై సమీక్ష నిర్వహించారు. ఈసందర్భంగా మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ మాట్లాడుతూ పేదలకు అండగా నిలుస్తామని అన్నారు. అధికారులు చిత్తశుద్ధితో పనిచేయాలని, నిధులు తెచ్చే బాధ్యత తాను తీసుకుంటానని అన్నారు. ప్రభుత్వ పథకాలు పేదలకు అందేలా చూడాలని ఆయన ఆదేశించారు. 2027లో రానున్న ధర్మపురి క్షేత్రంలో గోదావరి పుష్కరాలు జరగనున్నాయని, వీటిని అద్భుతంగా నిర్వహించేందుకు కృషి చేస్తామన్నారు. పుష్కరాల్లో భాగంగా ఇప్పటినుంచే ధర్మపురి క్షేత్రాన్ని అద్భుతంగా తీర్చిదిద్దేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. ధర్మపురిని ఏ విధంగా అభివృద్ధి చేయాలనే అంశంపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మంత్రుల సహకారంతో చర్చించి తగిన నిర్ణయం తీసుకుంటామన్నారు.

● సాగునీటిపై ప్రత్యేక దృష్టి

జిల్లాలో అధిక శాతం మంది వ్యవసాయ రంగంపైనే జీవిస్తున్నారని, రైతులకు సాగునీరు విషయంలో ఎలాంటి ఇబ్బందులు రాకుండా ఇరిగేషన్ అధికారులు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని మంత్రి ఆదేశించారు. తాగునీటి విషయంలోనూ ప్రజలు ఇబ్బందులు పడకుండా చర్యలు తీసుకోవాన్నారు. గ్రామాల్లో యూరియా కొరత లేకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. జగిత్యాల జిల్లాను అన్నిరంగాల్లో ముందు ఉంచుతానని, అధికారులు సహకరించాలని పేర్కొన్నారు. గతంలో ఉమ్మడి జిల్లా జడ్పీ చైర్మన్‌గా పనిచేసిన అనుభవంతో తన శాఖకు వన్నెతెచ్చే విధంగా పనిచేస్తానని మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ తెలిపారు. జిల్లాలో ఎస్సీ ఎస్టీ మైనార్టీ దివ్యాంగుల సంక్షేమానికి ప్రత్యేకంగా కృషి చేస్తానని చెప్పారు. జగిత్యాలలో నూతన డిగ్రీ కాలేజ్, స్టడీ సర్కిల్ నిర్మాణానికి నిధులు మంజూరు చేయించేందుకు తన వంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ప్రభుత్వ లక్ష్యానికి..

మిగతా 8లో

కేజ్‌వీల్స్‌తో ట్రాక్టర్ నడిపిన రైతుకు జరిమానా


కేజీవీల్ ట్రాక్టర్‌తో రైతు

ఎలిగేడు, జూలై 9 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని శ్రీశ్రీనగర్ ప్రాంతంలో కేజీవీల్ ట్రాక్టర్‌ను రోడ్డుపై నడుపుతున్న మండల చిన్నగట్టయ్యకు రూ.5వేల జరిమానాను విధించినట్లు తహసీల్దార్ యాకయ్య తెలిపారు. బుధవారం ఎస్‌ఐ సత్యనారాయణ సిబ్బందితో పెట్రోలింగ్ చేస్తున్న క్రమంలో నిబంధనలను అతిక్రమించి గట్టయ్య ట్రాక్టర్‌కు కేజ్‌వీల్స్ ఉపయోగించి నడిపించినట్లు తెలిపారు. దీంతో అతనితోపాటు ట్రాక్టర్‌నుపోలీస్‌స్టేషన్‌కు తరలించి, అధికారులకు అప్పగించినట్లు ఎస్‌ఐ పేర్కొన్నారు.

ఆదివారంపేట్‌లో ఒకరికి..

రామగిరి: ఆదివారంపేట్‌లో సీసీ రోడ్లపై కేజ్‌వీల్స్‌తో నడిచిన ట్రాక్టర్‌కు జరిమానా విధించారు. బుధవారం ఎంపీడీవో శైలజారాణి అధ్యక్షతన గ్రామసభ నిర్వహించారు. గ్రామంలో నెలకొన్న పారిశుధ్య పనులను పర్యవేక్షిస్తున్న సందర్భంగా గ్రామానికి చెందిన ఎలువాక లక్ష్మయ్యకు చెందిన కేజ్‌వీల్ ట్రాక్టర్ రోడ్డుపై వెళ్తుండగా గమనించిన ఎంపీడీవో రూ.2వేల జరిమానా విధించారు.

డ్రంకెన్‌డ్రైవ్‌లో పట్టుబడిన వ్యక్తులకు జరిమానా

శంకరపట్నం, జూలై 9 (ఆంధ్రజ్యోతి): శంకరపట్నం మండలం కేశవపట్నం పోలీసులు నిర్వహించిన డ్రంకెన్ డ్రైవ్‌లో పట్టుబడిన వ్యక్తులకు బుధవారం జరిమానా విధించినట్లు ఎస్‌ఐ శేఖర్‌రెడ్డి తెలిపారు. డ్రంకెన్‌డ్రైవ్‌లో పట్టుబడిన 10మందిని హుజూరాబాద్ సెకండ్‌క్లాస్ స్పెషల్ జుడిషియల్ మేజిస్ట్రేట్ ముందు హాజరుపరచగా రూ.11వేల జరిమానా విధించారు.

పైపులు, సర్వీస్ వైర్ ఎత్తుకెళ్లిన దుండగులు

శంకరపట్నం, జూలై 9 (ఆంధ్రజ్యోతి): శంకరపట్నం మండలం కేశవపట్నం శివారులోని ఎండీ అలీమోద్దీన్ వ్యవసాయ బావి విద్యుత్‌మోటర్‌కు అమర్చిన పైపులు, సర్వీస్‌వైర్‌తోపాటు అక్కడేఉన్న ప్లాస్టిక్ తట్టాలను గుర్తుతెలియని వ్యక్తులు ఎత్తుకెళ్లినట్లు బాధితుడు తెలిపారు. ఈ విషయంపై పోలీసులకు సమాచారం అందించగా, బ్లూకోట్ పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని వివరాలు నమోదు చేసుకున్నట్లు పేర్కొన్నారు.

కుక్కల దాడిలో పలువురికి గాయాలు

చందుర్తి, జూలై 9 (ఆంధ్రజ్యోతి): చందుర్తి మండలకేంద్రానికి చెందిన సుందరమ్మ, నాగమల్లేశం, బాబుతోపాటు మరో ఇద్దరిని పిచ్చి కుక్కదాడి చేసి గాయపరిచింది. అలాగే మరోవ్యక్తిని కోతి దాడిచేసి గాయపరిచినట్లు స్థానికులు తెలిపారు. ప్రజలపై పిచ్చికుక్కలు దాడి చేస్తున్నా అధికారులు, నాయకులు పట్టించుకోవడం లేదని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

యువతి అదృశ్యం

మల్యాల, జూలై 9 (ఆంధ్రజ్యోతి): మల్యాల మండలం సర్వాపూర్‌లో చందుర్తి మండలం మూడపల్లికి చెందిన బైరోజు రమ్య అలియాస్ లావణ్య(27) అదృశ్యమైనట్లు ఎస్సై నరేశ్‌కుమార్ తెలిపారు. రమ్య తండ్రి నర్సయ్య కుటుంబసభ్యులు జీవనోపాధిలో భాగంగా సోమవారం సర్వాపూర్‌కు బానోజీరాజేశం ఇంటికి వచ్చారు. మంగళవారం సైకిల్‌పై బయటకు వెళ్లగా తిరిగి ఇంటికిరాలేదు. పలుచోట్ల గాలించినా ఆచూకీ లభించకపోవడంతో రమ్య తండ్రి నర్సయ్య పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

అరచేతిలో రైల్వే సమాచారం

- రైల్‌వన్ పేరిట భారత రైల్వే శాఖ ప్రత్యేక యాప్
- ఈ నెల ఒకటో తేదీ నుంచి అందుబాటులోకి



కరీంనగర్ రూరల్, జూలై 9 (ఆంధ్రజ్యోతి): ప్రయాణికుల సౌకర్యార్థం భారత రైల్వే శాఖ ప్రత్యేక చర్యలు చేపడుతోంది. ఇందులో భాగంగా రైళ్లకు సంబంధించిన పూర్తి సమాచారం ఒకే చోట లభించే విధంగా యాప్‌ను తీసుకొచ్చింది. రైల్‌వన్ పేరిట ఉండే యాప్‌ను ఈ నెల ఒకటో తేదీన అందుబాటులోకి తీసుకొచ్చింది. ఇందులో టికెట్ల బుకింగ్ నుంచి ట్రైన్ స్థితిగతులు, భోజన వసతి వంటి పూర్తి సమాచారం లభిస్తాయి. ముఖ్యంగా రైల్వే టికెట్లు యాప్‌లో రిజర్వేషన్ చేసుకోవచ్చు. అత్యవసరమయ్యే అన్ రిజర్వుడ్ టికెట్లు కూడా వెంటనే కొనుగోలు చేసే అవకాశం ఉంటుంది. ప్లాట్ ఫామ్ టికెట్లు సైతం పొందవచ్చు. మనం వెళ్లాల్సిన ప్రాంతానికి ఏ రైళ్లు అందుబాటులో ఉన్నాయని వెతికేందుకు సర్చ్ ట్రైన్స్ బటన్ ఉంటుంది. ఏ ప్లాట్ ఫామ్‌పై రైలు ఆగుతుంది, కోచ్ పొజిషన్ ఎక్కడ ఉందో కూడా తెలుసు కోవచ్చు. రైలు ఎక్కడ ఉంది, ఎప్పుడు వస్తుంది అనే విషయాన్ని ట్రాక్ యువర్ ట్రైన్ ద్వారా తెలుసుకోవచ్చు.

పీఎన్ఆర్ సమాచారం

రిజర్వేషన్‌కు సంబంధించి ఇందులో పీఎన్ఆర్ స్థితిని తెలుసుకోవడానికి అవకాశం కల్పించారు. ముందస్తు రిజర్వేషన్ టికెట్ స్థితి, సీటు కన్ఫర్మేషన్ స్టేటస్, రైలు రద్దు, రిజర్వేషన్ రద్దు వంటి తదితర అంశాలను తెలుసుకోవచ్చు.

ఇష్టమైన ఆహారం

మనకు ఇష్టమైన ఆహారాన్ని ఆర్డర్ చేసుకునేలా యాప్‌లో అవకాశం కల్పించారు. ఇండియన్ రైల్వే క్యాటరింగ్ అండ్ టూరి జం ద్వారా వివిధ రైల్వే స్టేషన్లకు చేరుకునేందుకు ముందే నచ్చిన ఆహారాన్ని ఆర్డర్ చేసుకుంటే మీరు ప్రయాణిస్తున్న రైలులో మీ సీటు వద్దకే ఆహారాన్ని తీసుకొచ్చి ఇస్తారు.

రైల్ మదత్

సూచనలు ఇవ్వాలన్నా, రైళ్లలో సమస్యలు తలెత్తినా ఫిర్యాదు చేయడానికి రైల్ మదత్ విభాగం అందుబాటులో ఉంది. ఇందులో ఫిర్యాదు చేస్తే సమస్యలు పరిష్కారం అవుతాయి. రైలులోగానీ, స్టేషన్‌లో గానీ ఎక్కువ రేట్లకు అమ్మకాలు జరిపినా ఫిర్యాదు చేయవచ్చు.

యాప్ డౌన్‌లోడ్ ఇలా

సెల్‌ఫోన్‌లోని గూగుల్ ప్లేస్టోర్ నుంచి డౌన్‌లోడ్ చేయాలి. తర్వాత సెల్ నంబరు లేదా మెయిల్ ఐడీ ద్వారా రిజిస్ట్రేషన్ చేసుకోవాలి. పాస్‌వర్డుతో లాగిన్ అవ్వాలి.

ఆరు నెలలకు రెట్టింపు డబ్బుల పేరిట మోసం

- ఖమ్మం జిల్లా కేంద్రానికి చెందిన ఒకరి అరెస్టు

కరీంనగర్ క్రైం, జూలై 9 (ఆంధ్రజ్యోతి): తమ సంస్థలో పెట్టుబడి పెడితే ఆరు నెలలకు రెట్టింపు డబ్బులు ఇస్తామని చెప్పి ఆన్‌లైన్‌లో ప్రకటనలు ఇచ్చి కోటి రూపాయల వరకు వసూలు చేశారు. చివరికి మోసం చేయడంతో బాధితులు పోలీసులను ఆశ్రయించారు. ఈ కేసులో పోలీసులు ఒకరిని అరెస్టుచేసి కరీంనగర్ కోర్టులో బుధవారం హాజరుపరిచారు. పోలీసులు తెలిపిన వివరాలప్రకారం.. ఖమ్మం జిల్లా కేంద్రానికి చెందిన గంటల నవీన్, నజీర్ గోల్డ్ షైన్స్ స్క్రాప్ బిజినెస్‌లో పెట్టుబడి పెడితే ఆరు నెలల్లో రెట్టింపు డబ్బులు ఇస్తామని ఆన్‌లైన్‌లో ప్రకటనలు ఇచ్చారు. ఈ ప్రకటనలకు ఆకర్షితులైన ఉమ్మడి కరీంనగర్ జిల్లాకు చెందిన పలువురు దాదాపు కోటి రూపాయల వరకు డబ్బులు పెట్టుబడి రూపంలో ఆ సంస్థ ఖాతాకు పంపించారు. ప్రారంభంలో ఒకరిద్దరికి చిన్న మొత్తంలో ఆరు నెలల్లో రెట్టింపు డబ్బులు ఇచ్చారు. దీంతో చాలామంది పెట్టుబడి పెట్టారు. పెట్టుబడి పెట్టినవారిని గోవా టూర్‌కు కూడా తీసుకెళ్లారు. కొద్దిరోజుల తరువాత ఆ సంస్థను మూసివేసిన నవీన్, నజీర్ పెట్టుబడిదారులకు డబ్బులు చెల్లించకుండా మోసం చేశారు. దీనిపై కరీంనగర్ జిల్లాకు చెందిన ముగ్గురు బాధితులు స్థానిక సైబర్‌పోలీసులకు ఫిర్యాదు చేశారు. అప్పటికే ఇదే మోసానికి సంబంధించి నవీన్, నజీర్‌పై ఖమ్మంలో రెండుకేసులు నమోదయ్యాయి. కరీంనగర్‌లో తాజాగా సైబర్‌క్రైంపోలీసులు నవీన్, నజీర్‌తోపాటు ఖమ్మంకు చెందిన రాంచంద్రమూర్తిపై కూడా కేసు నమోదు చేశారు. ప్రస్తుతం నజీర్ పరారీలో ఉన్నాడు. రాంచంద్రమూర్తి బ్యాంక్ ఖాతాలోకి రెండు విడతలుగా 10లక్షల రూపాయలు ట్రాన్స్‌ఫర్ అయినట్లు పోలీసులు గుర్తించారు. నవీన్‌తో రాంచంద్రమూర్తి గోవాటూర్‌కు వెళ్లినట్లుగా సైబర్‌పోలీసుల విచారణలో తేలింది. దీంతోపాటు అతడి ఖాతాలో ఏడాదిగా రూ.కోటి 80 లక్షల వరకు లావాదేవీలు జరిగినట్లు గుర్తించారు. ఈ మేరకు రాంచంద్రమూర్తిని కరీంనగర్ సైబర్ క్రైం పోలీసులు ఖమ్మంలో అరెస్టు చేసి బుధవారం కోర్టులో హాజరుపరిచారు.

16 విద్యుత్ సబ్‌స్టేషన్లు మంజూరు

గణేశ్‌నగర్, జూలై 9 (ఆంధ్రజ్యోతి): వినియోగదారులకు మరింత మెరుగైన, నాణ్యమైన విద్యుత్ సరఫరా అందించడానికి కరీంనగర్ సర్కిల్ పరిధిలో 16 సబ్‌స్టేషన్లు మంజూరయ్యాయని టీజీఎన్‌పీడీసీఎల్ ఎస్‌ఈ మేక రమేష్‌బాబు తెలిపారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ సబ్‌స్టేషన్ల పనులు ముమ్మరంగా జరుగుతున్నాయన్నారు. డిమాండ్‌కు అనుగుణంగా అవసరం ఉన్నమేరకు కొత్తగా సబ్‌స్టేషన్ల నిర్మిస్తున్నామని, భవిష్యత్తులో ఎటువంటి లోవోల్టేజీ సమస్య ఉండదన్నారు. విద్యుత్ పంపిణీ మరింత మెరుగుపడుతుందని వివరించారు. ఈసబ్‌స్టేషన్లలో ఆధునిక సాంకేతికతను ఉపయోగిస్తున్నామన్నారు. రియల్‌టైం ఫీడర్‌మానిటర్ ఉంటుందని, విద్యుత్ సంబంధిత పూర్తి సమాచారం తెలుసుకునే వీలుంటుందని తెలిపారు.


కరీంనగర్ సర్కిల్‌లో నిర్మాణంలో ఉన్న విద్యుత్ సబ్‌స్టేషన్

కాంగ్రెస్ ప్రభుత్వంపై విషం చిమ్ముతున్న బీఆర్ఎస్ పెద్దలు

- కరీంనగర్ పార్లమెంటు కోకన్వీనర్ చక్రధర్‌రెడ్డి

గంభీరావుపేట, జూలై 9 (ఆంధ్రజ్యోతి): ప్రజానాయకుడు సీఎం రేవంత్‌రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్‌ప్రభుత్వంపై బీఆర్ఎస్‌పార్టీ పెద్దలు విషం చిమ్ముతున్నారని కరీంనగర్ పార్లమెంటు కోకన్వీనర్ కన్నమనేని చక్రధర్‌రెడ్డి ఆరోపించారు. గంభీరావుపేట మండలకేంద్రంలోని కాంగ్రెస్‌పార్టీ కార్యాలయంలో బుధవారం విలేకరుల సమావేశాన్ని ఏర్పాటు చేసి, బీఆర్ఎస్ పార్టీ పెద్దల తీరుపై మండిపడ్డారు. ప్రతిపక్షనేతలు అసెంబ్లీకి వచ్చి సమస్యలపై చర్చించే వీలుండగా, వేదికలపై లేనిపోని సవాళ్లుచేయడం సరైన పద్ధతి కాదన్నారు. రాష్ట్రాన్ని ఆర్థికసంక్షోభంలో నెట్టి, నేడునీతి మాటలు వల్లించటాన్ని ప్రజలు గమనిస్తున్నారని పేర్కొన్నారు. ఆర్థికసంక్షోభాన్ని అధిగమించేందుకు సీఎం రేవంత్‌రెడ్డి కృషిచేస్తూ, మరోవైపు మేనిఫెస్టోలో పెట్టిన ప్రజాసంక్షేమ పథకాలను దశలవారీగా అమలు చేస్తున్నాడన్నారు. రైతుల సంక్షేమమే లక్ష్యంగా రైతుల పక్షపాతిగా సీఎం రేవంత్‌రెడ్డి అహర్నిశలు కృషిచేస్తుంటే బీఆర్ఎస్ పార్టీ పెద్దలు ఓర్వలేక విమర్శలు చేస్తున్నారని అన్నారు. కార్‌రేస్, మద్యం కుంబకోణాల్లో కూరుకు పోయిన బీఆర్ఎస్ పెద్దలు నీతులు మాట్లాడటం సిగ్గుచేటన్నారు. సమావేశంలో ముస్తాబాద్ మండల మాజీ ఏఎంసీ చైర్మెన్ అంజన్‌రావు, జిల్లాఉపాధ్యక్షుడు కొమిరిశెట్టి తిరుపతి, సోషల్‌మీడియా ఇన్‌చార్జీ గౌరిశంకర్, మాజీసర్పంచ్ భూమరాజం, ఫాక్స్‌డైరెక్టర్లు అంజిరెడ్డి, నర్సింలు, తదితరులు ఉన్నారు.

పేకాటరాయుళ్ల అరెస్టు

హుజూరాబాద్, జూలై 9 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని సాయికన్వెన్షన్ హాల్లో పేకాడుతున్న 11మందిని పోలీసులు అరెస్టుచేశారు. తమకు అందినసమాచారం మేరకు సాయికన్వెన్షన్ హాల్‌పై దాడిచేశామని సీఐ కరుణాకర్ తెలిపారు. 11మందిని అరెస్టుచేసి వారినుంచి 19వేలనగదు, 11సెల్‌ఫోన్స్ స్వాధీనం చేసుకున్నామని ఆయన చెప్పారు.

చెక్ బౌన్స్ కేసులో 18 నెలల జైలు

సిరిసిల్లక్రైం, జూలై 9 (ఆంధ్రజ్యోతి): చెక్ బౌన్స్ కేసులో ముద్దాయికి 18నెలల జైలుశిక్ష విధిస్తూ బుధవారం సిరిసిల్ల ప్రథమశ్రేణిన్యాయమూర్తి ప్రవీణ్ తీర్పు వెల్లడించారు. కోర్టుఆర్డర్ వివరాల ప్రకారం.. సిరిసిల్లకుచెందిన ఎ లక్ష్మీనారాయణకు 2017లో కోడంనరేశ్ రూ.11.50 లక్షలు అప్పుఇచ్చి చెక్కు తీసుకున్నాడు. అనంతరం చెక్కును బ్యాంకులో వేయగా బౌన్స్‌అయింది. దీంతో బాధితుడు నరేశ్ న్యాయవాది లక్కం కిషోర్ ద్వారా సిరిసిల్ల కోర్టులో కేసు దాఖలు చేశాడు. ఈకేసును విచారించిన మెజిస్ట్రేట్ అప్పు తీసుకున్న లక్ష్మీనారాయణకు 18నెలల జైలుశిక్షతోపాటు రూ.15లక్షలు నరేశ్‌కు చెల్లించాలని తీర్పు ఇచ్చారు.

ప్రమాదకరంగా వంతెనలు

- ఇబ్బందులు పడుతున్న ప్రయాణికులు

మానకొండూర్, జూలై 9 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పోచంపల్లి గ్రామశివారు నుంచి జమ్మికుంట వరకు సాగునీటి సరఫరా చేస్తున్న డీబీఎం 6 ఉపకాల్వ వంతెనలు శిథిలావస్థకు చేరుకుని ప్రమాదకరంగా తయారయ్యాయి. ఈ కాల్వకు ఇరువైపులా నిర్మించిన రక్షణ గోడలు విరిగిపోయి ఏళ్లు గడుస్తున్నా మరమ్మతులకు నోచుకోవడం లేదు. దీంతో ప్రయాణికులకు ప్రయాణం ప్రమాదకరంగా మారింది. కరీంనగర్ నుంచి జమ్మికుంట ప్రధాన రహదారి వెంబడి నిత్యం ఆర్టీసీ బస్సులు, లారీలు, వందలాది ద్విచక్రవాహనాలు నడుస్తుంటాయి. ఈ కాల్వపై వంతెన రక్షణ గోడలు కూలి పోయి నాలుగేళ్లు గడుస్తున్నా అధికారులు, ఆర్‌అండ్‌బీ అధికారులు మరమ్మతు చేపట్టడం లేదు. దీంతోపాటు లలితాపూర్-దేవంపల్లి కాల్వ వంతెన సైతం శిథిలావస్థకు చేరుకుంది. ఎల్ఎండీ నుంచి నీటి సరఫరా చేసే సమయంలో వరద తాకిడికి గురవుతూ మరింత శిథిలావస్థకు చేరుకుంది. సంబంధిత అధికారులు స్పందించి మరమ్మతు పనులు చేపట్టాలని ప్రయాణికులు కోరుతున్నారు.


పోచంపల్లి వద్ద శిథిలావస్థకు చేరిన వంతెన

వలస కార్మికుడి ఆత్మహత్యాయత్నం

ఎల్లారెడ్డిపేట, జూలై 9 (ఆంధ్రజ్యోతి): ఆర్థిక ఇబ్బందులు, కుటుంబ కలహాలతో మనస్థాపం చెందిన రాజన్నసిరిసిల్ల జిల్లా ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలో అద్దెకు ఉంటున్న ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని ప్రకాశం జిల్లా దర్శి మండలం రాజంపల్లి గ్రామానికి చెందిన భవన నిర్మాణ కార్మికుడు ఏసు బుధవారం పురుగుల మందు తాగాడని స్థానికులు, కుటుంబ సభ్యులు తెలిపారు. అతడి పరిస్థితి విషమంగా ఉందన్నారు. వారి కథనం మేరకు.. ఏసు పదిహేనేళ్ల క్రితం ఉపాధి నిమిత్తం కుటుంబ సభ్యులతో కలిసి ఎల్లారెడ్డిపేటకు వలస వచ్చాడు. స్థానికంగా భవన నిర్మాణ పనులు చేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. సరైన పనులు లభించకపోవడం వల్ల ఆర్థిక ఇబ్బందులతో పాటు కుటుంబంలో గొడవలు చోటుచేసుకుంటున్నాయి. ఈ క్రమంలో ఏసు పురుగుల మందు తాగి అపస్మారక స్థితిలోకి వెళ్లాడు. గమనించిన కుటుంబ సభ్యులు మొదట సిరిసిల్లకు తరలించారు. అక్కడనుంచి ఎల్లారెడ్డిపేటలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తీసుకువచ్చారు. ప్రస్తుతం ఏసు పరిస్థితి విషమంగా ఉంది. కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నామని పోలీసులు వివరించారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

మల్యాల, జూలై 9 (ఆంధ్రజ్యోతి): కుటుంబ కలహాలతో మేడిపల్లి మండలం కొండాపూర్‌కు చెందిన గొడిసల గట్టయ్య(49) అనేవ్యక్తి సోమవారం కొండగట్టులో పెట్రోల్ పోసుకొని నిప్పు అంటించుకోగా చికిత్స పొందుతూ బుధవారం మృతిచెందాడు. మృతునికి భార్య, ఇద్దరు కుమారులు గలరు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నం

- చికిత్స పొందుతూ మృతి

జగిత్యాలరూరల్, జూలై 9 (ఆంధ్రజ్యోతి): జగిత్యాల మండలం మోతె గ్రామానికి చెందిన చందుకుమార్(22) అనే యువకుడు చికిత్స పొందుతూ బుధవారం మృతిచెందినట్లు జగిత్యాలరూరల్ ఎస్సై సదాకర్ తెలిపారు. చందుకుమార్ కొన్నిరోజులుగా ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొంటూ ఒంటరితనంతో బాధపడుతున్నాడు. దీంతో తీవ్రంగా మనస్థాపం చెంది ఈనెల6న మోతె నల్లగుట్ట శివారులో పురుగులమందు తాగగా బంధువులు జగిత్యాల ఏరియా ఆస్పత్రికి తరలించి చికిత్స అందించారు. పరిస్థితి విషమించడంతో బుధవారం ఉదయం మృతిచెందాడు. మృతుడి సోదరుడు రాజ్‌కుమార్ ఫిర్యాదుమేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఆర్టీసీ డ్రైవర్ మృతి


శ్రీకాంత్(ఫైల్)

కాల్వశ్రీరాంపూర్, జూలై 9 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో ఆర్టీసీడ్రైవర్ మృతిచెందిన ఘటన బుధవారం సాయంత్రం చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళ్లితే మండలంలోని ఇదులాపూర్ గ్రామశివారులో రెండుద్విచక్ర వాహనాలు ఢీకొనగా, జాఫర్‌ఖాన్‌పేట గ్రామానికి చెందిన తోట శ్రీకాంత్(32) అక్కడికక్కడే మృతి చెందాడు. కాగా శ్రీకాంత్ ఆర్టీసీలో ఔట్‌సోర్సింగ్ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. విధులు ముగించుకొని ఇంటికివస్తుండగా మార్గమధ్యలో ఈప్రమాదం జరిగింది. మృతుడికి భార్య, కుమారుడు ఉన్నారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ఇసుక క్వారీలో పని కల్పించాలి


పోలీసులకు ఫిర్యాదు అందజేస్తున్న హిమ్మత్‌నగర్ గ్రామస్థులు

వీణవంక, జూలై 9 (ఆంధ్రజ్యోతి): మండలంలోని హిమ్మత్‌నగర్ గ్రామస్థులు కొండపాక ఇసుక క్వారీలో లారీలపై పరదలు కప్పే ఉపాధి తమకు కల్పించాలని బుధవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. లేనిపక్షంలో గ్రామంలో చేపట్టే రిలే నిరాహార దీక్షలకు అనుమతి ఇవ్వాలని ఫిర్యాదులో పేర్కొన్నారు. తమ గ్రామంలోని నల్లకుంట కట్టపై నుంచి రోజు వందలాది లారీలు వెళ్తుండడంతో రోడ్డు ధ్వంసం అవడంతోపాటు ప్రజలకు రాక పోకలకు ఇబ్బంది ఏర్పడుతోందన్నారు. కార్యక్రమంలో గెల్లు మల్లయ్య, నల్ల తిరుపతిరెడ్డి, రమేష్, తిరుపతిరెడ్డి, నల్ల కొండాల్‌రెడ్డి, రాజు, సమ్మయ్య తదితరులున్నారు.

ఇసుక లారీ పట్టివేత


పోలీసులు అదుపులోకి తీసుకున్న ఇసుక లారీ

వేములవాడ, జూలై 9 (ఆంధ్రజ్యోతి): నంబర్ ప్లేటు మార్చివేసి అక్రమంగా ఇసుకను తరలిస్తున్న లారీని వేములవాడ పట్టణ పోలీసులు బుధవారం పట్టుకున్నారు. ఉమ్మడి కరీంనగర్ జిల్లా పరిధిలోని వీణవంక మండలం కొండపాక ఇసుక రీచ్ నుంచి టిజి 23 టి 1225 నంబర్‌గల వాహనానికి ఇసుక రవాణా కోసం వేబిల్‌తో కూడిన అనుమతి ఉండగా, పోలీసుల తనిఖీలలో లారీ రిజిస్ట్రేషన్ నంబర్‌కు ఇంజన్, చాసిస్ నంబర్‌కు మధ్య తేడా ఉన్నట్లు గుర్తించి లారీని స్వాధీనం చేసుకొని స్థానిక బస్ డిపోకు తరలించారు. ఈ విషయమై వేములవాడ పట్టణ సీఐ వీరప్రసాద్ వివరణ కోరగా, వాహనాన్ని స్వాధీనం చేసుకున్నామని, పూర్తి విచారణ అనంతరం కేసు నమోదు చేస్తామని తెలిపారు.

ఉపాధ్యాయులకు యేటా ప్రమోషన్లు ఇవ్వాలి


మాట్లాడుతున్న తపస్ రాష్ట్ర సహాధ్యక్షుడు నరేందర్‌రావు

జగిత్యాల అగ్రికల్చర్, జూలై 9 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఉపాధ్యా యులకు యేటా బదిలీలు, ప్రమోషన్లు ఉండేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని తపస్ రాష్ట్ర సహాధ్యక్షుడు అయిల్నేని నరేందర్‌రావు రాష్ట్ర ప్రభుత్వానికి సూచించారు. బుధవారం జగిత్యాల పట్టణంలోని పలు పాఠశాలల్లో తపస్ సభ్యత్వ నమోదును ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇటీవల రిటైర్‌మెంట్ల నేపథ్యంలో వందలాదిగా ఉపాధ్యాయ పోస్టులు ఖాళీ అవుతున్నాయన్నారు. పాఠశాలల్లో బోధనకు ఆటంకం కలగకుండా ప్రతిఏటా బదిలీలు, ప్రమోషన్లు నిర్వహించడానికి వేసవి సెలవులలో పూర్తిచేసేలా ఒక క్యాలెండర్‌ను రూపొందించాలని ఆయన అన్నారు. అవసరమైతే నెల వారి ప్రమోషన్లు ఇవ్వాలని సూచించారు. దీనివల్ల పాఠశాలల్లో ఉపాధ్యాయుల కొరత తీరుతుందని అన్నారు. ఈ విషయమై విద్యాశాఖ అధికారులు నిర్ణయం తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో తపస్ జగిత్యాలజిల్లా అధ్య క్షులు బొనగిరి దేవయ్య, కార్యదర్శి సురేందర్, పట్టణ కార్యదర్శి కట్టా రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

జేఎల్ఎంపై సస్పెన్షన్ వేటు

కథలాపూర్, జూలై 9 (ఆంధ్రజ్యోతి): కథలాపూర్ మండలం తాండ్ర్యాలలో నాలుగు రోజుల కిందట ఇప్పపల్లికి చెందిన హేమ్యానాయక్ అనే రైతు ట్రాన్స్‌ఫార్మర్‌పై విద్యుదాఘాతంకు గురైన ఘటనలో జేఎల్ఎంను బాధ్యుడిగా చేస్తూ సస్పె న్షన్ వేటువేశారు. ట్రాన్స్‌ఫార్మర్‌పై ఫ్యూజ్ వేస్తుండగా విద్యుత్ సరఫరా కావడంతో రైతు తీవ్రంగా గాయపడి ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న విషయం తెలిసిందే. ఏడీఈ రఘుపతి విచారణ జరిపి ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు జేఎల్ఎంను సస్పెండ్‌చేస్తూ ఉత్తర్వులు జారీచేసినట్టు అంబారిపేట సబ్ ఇంజినీర్ భరత్ తెలిపారు.

మహిళ మెడలోని బంగారు గొలుసు చోరీ

కరీంనగర్ క్రైం, జూలై 9 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ మారుతినగర్‌లో బుధవారం వేకువజామున 4గంటలకు ఓ ఇంట్లోకి చొరబడి మహిళ మెడలో నుంచి దొంగ బంగారుగొలుసు తెంపుకొని పారిపోయాడు. పోలీసుల వివరాల ప్రకారం.. బాధితురాలు, ఆమె సోదరి అంజలి కరీంనగర్ వెంకటేశ్వరస్వామిగుడి ఎదురుగా మార్కెట్‌లో కూరగాయల వ్యాపారం చేస్తుంటారు. తెల్లవారుజామున 3:30గంటల సమయంలో అంజలి ఆటోలో ముందుగా మార్కెట్‌కి వెళ్లింది. 4 గంటల సమయంలో దొంగ ఇంట్లోకి ప్రవేశించి స్వరూపముఖంపై దిండుతో అదిమిపట్టి ఆమె మెడలో ఉన్న రెండు వరుసల బంగారు గొలుసును లాక్కొని పారిపోయాడు. బాధితురాలు వెంటనే అప్రమత్తమై అతడిని వెంబడించినా ఫలితం లేకపోయింది. పోలీసులు సంఘటనా స్థలాన్ని పరిశీలించి క్లూస్‌టీంతో ఆధారాలు సేకరించారు. డాగ్‌స్క్వాడ్‌తో తనిఖీలు నిర్వహించారు.సీసీకెమెరాలను పరిశీలిస్తున్నారు. బాధితురాలి ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నామని కరీంనగర్ మూడోటౌన్ పోలీసులు తెలిపారు.

యువకులు సరైన మార్గంలో పయనించాలి

ఇల్లంతకుంట, జూలై 9 (ఆంధ్రజ్యోతి): యువకులు సరైన మార్గంలో పయనించాలని ఎస్సై సిరిసిల్ల అశోక్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. గంజాయికి బానిసలుగా మారడం వల్ల జీవితాలు రోడ్డున పడుతాయన్నారు. యువకులు వ్యసనాల బారినపడకుండా చదువుపై దృష్టి నిలపాలని, అప్పుడే మంచి గుర్తింపు లభిస్తుందన్నారు. వాహనదారులు సరైన ధ్రువీకరణ పత్రాలు కలిగి ఉండటంతో పాటు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలన్నారు. ప్రతిరోజు వాహనాల తనిఖీలు కొనసాగుతాయని, డ్రంకెన్‌డ్రైవ్ పరీక్షలలో పట్టుబడితే జైలుకు వెళ్లవలసి ఉంటుందన్నారు. తల్లిదండ్రులు తమ పిల్లలను నిత్యం గమనిస్తు ఉండాలని, ఏదైన తేడాగా కనిపిస్తే తమకు సమాచారం ఇవ్వాలని సూచించారు.

మొక్కలే జీవకోటికి ప్రాణాధారం

- వనమహోత్సవంలో ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం


మొక్క నాటి నీరు పోస్తున్న ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం

గంగాధర, జూలై 9 (ఆంధ్రజ్యోతి): జీవకోటికి ప్రాణాధారమైన మొక్కలను నాటి వాటి సంరక్షణ బాధ్యతను తీసుకోవాలని ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం అన్నారు. బుధవారం వనమహోత్సవంలో భాగంగా గంగాధర మార్కెట్‌యార్డు సమీపంలో ఆయన మొక్కలు నాటారు. అధికారులు, నాయకుల సమన్వయం, ప్రజల భాగస్వామ్యంతో గ్రామాల్లో మొక్కలు నాటాలన్నారు. అనంతరం గంగాధర ప్రజాకార్యాలయంలో ఆర్థిక పునరావాసం స్కీంలో గర్షకుర్తి గ్రామానికి చెందిన దివ్యాంగురాలు మామిడిపల్లి విజయకు మంజూరైన రూ.50వేల చెక్కును ఆయన అందించారు. కార్యక్రమంలో మార్కెట్‌కమిటీ చైర్మన్ జాగిరపు రజిత శ్రీనివాస్‌రెడ్డి, తహసీల్దార్ అనుపమ, ఎంపీడీవో రాము, తదితరులు పాల్గొన్నారు.

ఎస్‌యూలో సీనియర్ అసిస్టెంట్లకు పదోన్నతులు



పత్రాలను అందజేస్తున్న ఎస్‌యూ వీసీ ఉమేష్‌కుమార్

గణేశ్‌నగర్, జూలై 9 (ఆంధ్రజ్యోతి): శాతవాహన విశ్వవిద్యాలయంలో సీనియర్ అసిస్టెంట్లుగా పనిచేస్తున్న టి.రాజేశ్వరి, రెడ్డవేణి భీమయ్యకు సూపరింటెండెంట్‌లుగా పదోన్నతి కల్పిస్తూ యూనివర్సిటీ వైస్ చాన్సలర్ ఉమేష్‌కుమార్ బుధవారం ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా వారిని వీసీ ఉమేష్ కుమార్, రిజిస్ట్రార్ జె.రవికుమార్, సూపరిం టెండెంట్ అభినందించారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ రిజిస్ట్రార్‌లు వై.కిషోర్, ప్రసాద్, ఓఎస్‌డీ హరికాంత్, సంతోష్, మారుతి, శ్రీకాంత్, మాధురి, సాయి, ఫసీయొద్దీన్, రమేష్, నర్సయ్య పాల్గొన్నారు.

వర్షాలు కురువాలని గోదావరిఖని నుంచి వేములవాడకు పాదయాత్ర



వేములవాడకు పాదయాత్ర చేస్తున్న రవితేజ

సుల్తానాబాద్, జూలై 9 (ఆంధ్రజ్యోతి): వర్షాలు సమృద్ధిగా కురువాలని వేడుకుంటూ వేములవాడ రాజరాజేశ్వర స్వామి దేవస్థానం వరకు ఓ యువకుడు పాదయాత్ర చేపట్టాడు. గోదావరిఖని మార్కండేయనగర్‌కు చెందిన ముద్దమల్ల రవితేజ అనే యువకుడు ఓ ఎలక్ట్రానిక్ షాపులో గుమస్తాగా పని చేస్తున్నాడు. వారి స్వగ్రామం హుజురాబాద్ ప్రాంతం. వారి బంధువులు, గ్రామస్థులు వర్షాధారంగా వ్యవసాయం చేస్తుంటారు. జూన్ నెల మొదటి వారంలోనే పత్తి తదితర పంటలకు శ్రీకారం చుట్టి వరి నార్లు పోసుకున్నారు. వర్షాలు లేకపోవడంతో సాగు ఎలా అంటూ రైతన్నల ఆందోళనలు చెందుతున్నారు.

గోదావరిఖని నుంచి వేములవాడ వరకు 110 కిలో మీటర్ల దూరం ఉండగా మంగళవారం మధ్యాహ్నం గోదావరిఖని నుంచి బయలుదేరిన రవితేజ బుధవారం రాత్రి సుల్తానాబాద్ మండలం చిన్నకలువల గ్రామంలోని హన్‌మాన్ ఆలయంలో బస చేశాడు. ఉదయం పాదయాత్ర ప్రారంభించగా కాట్నపల్లి వద్ద రాజీవ్ రహదారిపై విలేకరులతో మాట్లాడారు. వర్షాలు కురిపించాలని వేములవాడ రాజరాజేశ్వర స్వామిని వేడుకుంటు పాదయాత్ర చేస్తున్నట్లు రవితేజ తెలిపాడు. కరీంనగర్ మండలం ముగ్దుంపూర్ వద్ద బుధవారం రాత్రి బస చేస్తానని, గురువారం రాత్రి వరకు వేములవాడ చేరుకుంటానని తెలిపారు.

ప్రాజెక్టులు వెలవెల

- వర్షాలు కురవక నిండని జలాశయాలు
- మందకొడిగా వ్యవసాయ పనులు
- ఆందోళన చెందుతున్న అన్నదాతలు


ఎండిపోయిన రాజన్న సిరిసిల్లలోని మధ్య మానేరు రిజర్వాయర్

(ఆంధ్రజ్యోతి, పెద్దపల్లి)

వర్షాకాలం సీజన్ ప్రారంభమై 40 రోజులు గడిచాయి. ఇప్పటి వరకు ఒక్క భారీ వర్షం కురవలేదు. దీంతో ప్రాజెక్టులు నీరు లేక వెలవెలబోతున్నాయి. గత ఏడాది ఇదే సమయానికి భారీ వర్షాలు కురిశాయి. ఈ ఏడాది ఆలస్యం అవుతుండడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. వ్యవసాయ బావుల కింద మాత్రమే వరినాట్లు వేస్తున్నారు. సీజన్ ప్రారంభంలో అడపాదడపా కురిసిన వర్షాలతో ఆరుతడి పంటలను సాగు చేశారు. కానీ సరైన వర్షాలు లేక ఆ పంటలు ఎదగడం లేదు.

● ప్రాజెక్టుల వారీగా పరిస్థితి

ఉమ్మడి జిల్లాకు వరప్రదాయిని అయిన శ్రీరాంసాగర్ ప్రాజెక్టుకు నామమాత్రంగా వరద నీరు వస్తోంది. ప్రాజెక్టు పూర్తి


ఎల్‌ఎండీలో తగ్గిన నీటి మట్టం

స్థాయి నీటిమట్టం 80.5 టీఎంసీలు కాగా, ప్రస్తుతం 19.22 టీఎంసీల నీళ్లు మాత్రమే ఉన్నాయి. ప్రాజెక్టు నీటిమట్టం 60 టీఎంసీలకు చేరితేనే ఆయకట్టుకు సాగునీటిని విడుదల చేస్తారు. వ్యవసాయశాఖ అధికారుల సూచనల ప్రకారం ఆగస్టు 15లోపే వరినాట్లు వేస్తే మంచి దిగుబడులు వస్తాయి. కానీ వర్షాలు రాక వరద నీరు చేరడం లేదు.

- శ్రీపాద ఎల్లంపల్లి ప్రాజెక్టు పూర్తి స్థాయి నీటి మట్టం 20.175 టీఎంసీలు కాగా ప్రస్తుతం 8.76 టీఎంసీల నీళ్లు మాత్రమే ఉన్నాయి. ఈ ప్రాజెక్టు ద్వారా సుమారు లక్ష ఎకరాలకు పైగా సాగునీటిని అందించాల్సి ఉంది. హైదరాబాద్ నగర ప్రజలకు, పెద్దపల్లి, రామగుండం, మంథని, జగిత్యాల అసెంబ్లీ నియోజకవర్గం తాగునీటిని సరఫరా చేయాల్సి ఉంటుంది. ఎన్టీపీసీ అవసరాలకు కూడా ఈ ప్రాజెక్టు ద్వారానే నీటిని విడుదల చేస్తారు. వర్షాలు లేకపోవడంతో ప్రాజెక్టు నిండడం లేదు.

- రాజన్న సిరిసిల్ల జిల్లా పరిధిలోని మధ్య మానేరు రిజర్వాయర్ పూర్తి స్థాయి నీటిమట్టం 27.55 టీఎంసీలు కాగా ప్రస్తుతం 6.90 టీఎంసీల నీళ్లు మాత్రమే ఉన్నాయి.

- కరీంనగర్ సమీపంలోని లోయర్ మానేరు డ్యామ్ పూర్తి స్థాయి నీటిమట్టం 24.0 టీఎంసీలు కాగా ప్రస్తుతం 6.190 టీఎంసీల నీళ్లు మాత్రమే ఉన్నాయి. భారీ వర్షాలు కురిస్తేనే ఈ ప్రాజెక్టులకు శ్రీపాద ఎల్లంపల్లి నుంచి నంది మేడారంలోని నంది, గాయత్రి పంపు హౌస్‌ల ద్వారా నీటిని ఎత్తిపోస్తారు. శ్రీపాద ఎల్లంపల్లిలోకి ఎగువ ప్రాంతాల్లో కురిసే వర్షం నీటితో పాటు కడెం, ఎస్సారెస్పీ పూర్తి స్థాయి నీటిమట్టంకు చేరుకున్న తర్వాత విడుదల చేసే అదనపు నీరు రావాల్సి ఉంటుంది.

శ్రీపాద ఎల్లంపల్లి ప్రాజెక్టు గత ఏడాది జూలై 20 నాటికి పూర్తి స్థాయి నీటిమట్టానికి చేరుకున్నది. కృష్ణా నది తీర ప్రాంతాల్లో భారీ వర్షాలు కురుస్తుండగా ఆ నదిపై నిర్మించిన అన్ని ప్రాజెక్టులకు వరద నీరు వచ్చి చేరుతోంది. గోదావరి తీర ప్రాంతాల్లో వర్షాలు లేక ప్రాజెక్టులు వెలవెలబోతున్నాయి. వర్షాలు కురవకపోతే ఈ వానాకాలం సీజన్‌కే కాకుండా యాసంగి సీజన్‌కు కూడా సాగునీటితోపాటు ఈ ప్రాంత ప్రజలు తాగునీటి కష్టాలు ఎదుర్కోవాల్సి ఉంటుంది. రైతులంతా వరుణుడి పైనే ఆశలు పెట్టుకున్నారు.

మొలకెత్తని పత్తి.. ముదురుతున్న నారు

- వర్షాలు కురవకపోవడంతో రైతుల్లో ఆందోళన
- నెల రోజులు దాటినా ఎదగని పత్తి
- బావుల్లోనూ నీటికి కటకటే


విత్తనాలు నాటి ఇరవై రోజులు దాటినా సక్రమంగా మొలకెత్తని పత్తి పంట

సుల్తానాబాద్, జూలై 9 (ఆంధ్రజ్యోతి): ఈ యేడు వర్షాలు సమృద్ధిగా కురుస్తాయని వాతావరణ శాఖ అంచనాలతో రైతులు సాగు పనులు మొదలుపెట్టారు. జూన్‌లో అడపాదడపా వర్షాలు కురవడంతో అన్నదాతలు ఆనందంగా సాగు పనులు ప్రారంభించారు. నెల రోజులు కావస్తున్నా వానల ఊసే లేకపోవడంతో రైతులు అవేదన వ్యక్తం చేస్తున్నారు. రోహిణి కార్తె ఆరంభంలోనే నార్లు పోయగా ముదిరిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సాగు పనులు ఆలస్యం కావడంతో దాని ప్రభావం పంటల దిగుబడుల పై కూడా పడుతాయని రైతులు అంటున్నారు. సుల్తానాబాద్ మండంలోని చాలా గ్రామాలలో రైతులు నార్లు పోసుకుని వానల కోసం ఎదురు చూస్తున్నారు. జూన్ మూడో వారంలో వానలు కురిస్తే సీజన్ సకాలంలో ప్రారంభం అయ్యేదని, ఇప్పటికీ వానలు కురవక పోవడంతో సీజన్ అయోమయంగా మారిందని రైతులు ఆవేదన చెందుతున్నారు.

● ఎదగని మొక్కలు:

మండలంలోని రేగడి మద్దికుంట, అల్లీపూర్, మల్లయ్యపల్లి, రామునిపల్లి, కనుకుల, సుద్దాల, కొదురుపాక, నారాయణపూర్, దేవునిపల్లి, తదితర గ్రామాలలో రైతులు ఎక్కువగా పత్తి పండిస్తారు. ఈసారి నెల రోజుల క్రితమే పత్తి విత్తనాలు వేసుకున్నారు. ఒక్కొక్క రైతు కౌలుకు తీసుకుని మరీ పత్తి సాగు చేస్తున్నారు. కానీ వర్షాలు కురవక పోవడంతో చాలా విత్తనాలు మొలవనే లేదు. ఎండ వేడికి భూమిలోపలే అవి మాడి పోయాయని రైతులు అంటున్నారు. కొన్ని చోట్ల చేనులో అక్కడక్కడ మాత్రమే మొక్కలు వచ్చాయి.

అంతర పంటగా కంది
లక్ష్మి, రైతు



పత్తిలో అంతర పంటగా కంది పంట సాగు చేయాలని ఎంచు కున్నాం. ఈ నెలలో వానలు కరు స్తాయని సాగు పనులు ప్రారంభిస్తే అసలు వర్షాల జాడే లేకుండా పోయింది. అయినా ఆశతో ఈ పత్తి చేనులోనే అంతర పంటగా కంది విత్తనాలను విత్తుకుంటున్నాం.

ప్రభుత్వం ఆదుకోవాలి: గోపిడి ప్రభాకర్ రెడ్డి, రైతు, రేగడిమద్దికుంట



నాలుగు ఎకరాలను కౌలుకు తీసుకుని పత్తి పంట వేస్తే మొలవనే లేదు. నెల రోజులు కావస్తున్నా వానలు లేవు. నాలుగు ఎకరాలకు విత్తనాలు. కూలీలకు ఇరవై వేలు నష్టపోయాను. చాలా మంది రైతులు నష్టపోతున్నారు. ప్రభుత్వం ఆదుకోవాలి.


రామునిపల్లిలో పత్తి మొలవని చోట విత్తనాలు నాటుతున్న తల్లీ కూతుళ్లు

మళ్లీ విత్తనాలు వేస్తున్నాం:
స్వప్న, అక్షయ (తల్లీ కూతుళ్లు)

రామునిపల్లి గ్రామంలో కౌలుకు తీసుకుని పత్తి సాగు చేస్తున్నాం. నెల రోజుల కిందట పత్తి విత్తనాలు వేశాం. కానీ ఇప్పటికి అవి మొలవలేదు. దాంతో తాము ఎక్కడెక్కడ మొలవలేదో ఆయా చోట్ల మళ్లీ విత్తు కుంటున్నాం. నాలుగైదు రోజులలో వానలు కురవక పోతే పత్తి పంట చేతికి రాదు. దాంతో వరుణ దేవుని కరుణ కోసం ఎదురు చూస్తున్నాం.

విద్యాధికారి కార్యాలయంలో మండల పరిషత్ సేవలు

- విద్యాశాఖకు లేని ఆఫీసు
- పాఠశాల గదిలో ఎంఈవో విధులు
- సిబ్బందికి, ఉపాధ్యాయులకు ఇబ్బందులు
- మండల పరిషత్‌ను ఖాళీ చేయించాలంటున్న విద్యార్థి సంఘాలు


విద్యాధికారి కార్యాలయంలో కొనసాగుతున్న మండల పరిషత్

వీర్నపల్లి, జూలై 9 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం విద్యా వ్యవస్థను పటిష్టపరిచే విధంగా చర్యలు చేపడుతున్నా.. మారుమూల అటవీ ప్రాం తంలోని వీర్నపల్లిలో ఆచరణకు నోచుకోవడం లేదు.. 2016లో నూతన మండలంగా ఏర్పాటు చేసినా అభివృద్ధి అంతంత మాత్రంగానే ఉంది. మండల కేంద్రంలోని జిల్లా పరిషత్, ఆదర్శ పాఠశాలల ఆవరణలో అందుబాటులో ఉండే విధంగా ప్రభుత్వ నిధులతో మండల విద్యాధికారి కార్యాలయాన్ని నిర్మించారు.

మండలంగా ఏర్పాటు చేసినా పూర్తిస్థాయి విద్యాధికారి, సిబ్బందిని నియమించక ఉమ్మడి ఎల్లారెడ్డిపేట నుంచే ఇన్‌చార్జి అధికారులు, సిబ్బంది కార్యకలాపాలు నిర్వహించారు. దీంతో విద్యాధికారి కార్యాలయంలో మండల పరిషత్ కార్యాలయాన్ని తాత్కాలికంగా ఏర్పాటు చేశారు. గత సంవత్సరం ప్రభుత్వం విద్యాశాఖలో పాఠశాలలకు ఇబ్బందులు కలగకుండా ఉండేలా మండలానికి ఎంఈవోను నియ మించి, సిబ్బందిని కేటాయించారు. కానీ మండల విద్యాధికారి కార్యాలయంలో ఇంకా మండల పరిషత్ సేవలు కొనసాగిస్తున్నారు. దీంతో విద్యాశాఖకు ఆఫీసు కరువైంది.

పాఠశాల గదిలోనే విధులు..

మండల కేంద్రలోని జిల్లా పరిషత్ పాఠశాలలోని ఓ గదిలో విద్యాశాఖ కార్యాలయాన్ని కొనసాగిస్తున్నారు. అదే గదిలో ఎంఈవో, సిబ్బంది విధులు నిర్వహిస్తున్నారు. మండలంలో కేజీబీవి, ఆదర్శ పాఠశాలలతో కలిపి 24 ప్రభుత్వ పాఠశాలలు ఉన్నాయి. పాఠశాలల పనుల పై వచ్చే ఉపాధ్యాయులకు కార్యాలయం లేకపోవడంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అందరూ గదిలో ఒకే దగ్గర పనిచేయడంతో ఇబ్బందులు పడాల్సివస్తోంది. ఉపాధ్యాయులకు సమావేశాలు ఏర్పాటు చేసుకోవడంలో కూడా ఇబ్బందులు ఎదురవుతున్నాయి. మండల కేంద్రంలో ఉన్న విద్యాధికారి కార్యాలయాన్ని అప్పగించాలని పలువురు ఉపాధ్యాయులు అభిప్రాయపడుతున్నారు.

మండల పరిషత్‌ను ఖాళీ చేయాలి..

విద్యాధికారి కార్యాలయంలో కొనసాగుతున్న మండల పరిషత్ కార్యాలయాన్ని ఖాళీ చేయించాలని విద్యార్థి సంఘాలు కోరుతున్నాయి. పాఠశాలల ఆవరణలో మండల పరిషత్ కార్యాలయాన్ని ఏర్పాటు చేయడంతో విద్యార్థుల చదువు అంతరాయం కలుగుతోంది. రాజకీయ నాయకులు, కార్మికులు ధర్నాలు, ఆందోళనల నినాదాలు చేయడంతో విద్యార్థులు సరిగా చదువలేకపోతున్నారు. ప్రభుత్వం ప్రత్యేక చొరవ చూపి మండల పరిషత్‌కు పక్కా భవనాన్ని కేటాయించాలని, ఉన్నతాధికారులు మండల విద్యాధికారికి కార్యాలయాన్ని అప్పగించాలని పలువురు కోరుతున్నారు.

పాఠశాలలో ఆఫీసుతో విద్యారులకు ఇబ్బందులు..
జాలపల్లి మనోజ్‌కుమార్, విద్యార్థి నాయకుడు



పాఠశాలలో ఎంఈవో ఆఫీసు ఉండటంతో విద్యార్థులకు ఇబ్బందులు కలుగుతున్నాయి. విద్యా సమస్యలను తెలిపేందుకు వెళ్లినప్పుడు విద్యార్థుల చదువుకు అంతరాయం కలుగుతుంది. ఆఫీసు సరిగా లేక కార్యాలయ సిబ్బంది ఇబ్బందులు పడుతున్నారు. వెంటనే ఎంఈవోకు స్వంత భవనాన్ని అప్పగించాలి.

కార్యాలయాన్ని స్వాధీనం చేసుకుంటాం...
తుమ్మ శ్రీనివాస్, ఎంఈవో, వీర్నపల్లి.



విద్యాధికారి కార్యాలయంలో మండల పరిషత్‌ను తాత్కాలికంగా కొనసాగిస్తున్నారు. మండల పరిషత్ కార్యాలయం పాఠశాలలకు సమీపంలో ఉండటంతో పలువురి ఆందోళనలతో విద్యార్థులకు ఇబ్బందులు కలుగుతున్నాయి. ఉన్నతాధికారులకు సమాచారాన్ని అందించి వారి ఆదేశాల మేరకు నిర్ణయం తీసుకుంటాం.

యూరియా కేటాయింపులు తగ్గించడం అన్యాయం

కేంద్ర వ్యవసాయ శాఖ మంత్రికి లేఖ రాసిన పెద్దపల్లి ఎంపీ

గోదావరిఖని, జూలై 9 (ఆంధ్రజ్యోతి): తెలంగాణకు అవసరమైన యూరియా మొత్తాన్ని కేటాయించకుండా, ఇతర రాష్ట్రాలకు మళ్లించడం అన్యాయమని పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీకృష్ణ మండిపడ్డారు. ఈ మేరకు కేంద్ర వ్యవసాయ శాఖ మంత్రికి ఎంపీ లేఖ రాశారు. ప్రతిపక్ష పార్టీలు అధికారంలో ఉన్న రాష్ట్రాలకు కోత విధిస్తూ, బీజేపీ పాలిత రాష్ట్రాలకు సరఫరా చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. 2025 ఖరీఫ్ సీజన్‌లో తెలంగాణకు 30 వేల టన్నుల కేటాయించగా, గత సంవత్సరం 60వేల టన్నులు కేటాయించినట్టు, 45శాతం యూరియా తగ్గించినట్టు తెలిపారు. ఆర్ఎఫ్‌సీఎల్‌లో ఉత్పత్తి చేసిన యూరియా కూడా తెలంగాణకు ఇవ్వకుండా ఇతర రాష్ట్రాలకు తరలించడాన్ని ఖండిస్తున్నట్టు ఎంపీ పేర్కొన్నారు. గతేడాది స్థాయిలో యూరియా కేటాయింపులను వెంటనే పునరుద్ధరించాలని, ఆర్ఎఫ్‌సీఎల్‌లో తయారైన యూరియాను మొదట తెలంగాణకే కేటాయించాలని, రాజకీయ ప్రేరణలకంటే రైతుల అవసరాలకు ప్రాధాన్యం ఇవ్వాలని కోరారు.

ఎస్సారార్ కళాశాల డిగ్రీ ఫలితాలు విడుదల

గణేశ్‌నగర్, జూలై 9 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ ఎస్సారార్ కళాశాలలో డిగ్రీ రెండో, నాలుగో, ఆరో సెమిస్టర్ ఫలితాలను బుధవారం విడుదల చేశారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ రామకృష్ణ మాట్లాడుతూ ఎస్సారార్ కళాశాల అటనామస్ హోదాలో డిగ్రీ మొట్టమొదటి పూర్తిస్థాయి బ్యాచ్ ఫలితాలు విడుదల చేయడం సంతోషంగా ఉందన్నారు. ఆరో సెమిస్టర్‌తో పాటు డిగ్రీ కోర్సు ఉత్తీర్ణులైన వారు 79 శాతం, రెండో సెమిస్టర్‌లో 30 శాతం నాలుగో సెమిస్టర్‌లో 38 శాతం ఉత్తీర్ణత సాధించి నట్లు వివరించారు. ఫలితాలు వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ రామకృష్ణ, శాతవాహన యూనివర్సిటీ కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ డాక్టర్ సురేష్‌కుమార్, కళాశాల కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్ డాక్టర్ తిరుకోవెల శ్రీనివాస్ వైస్ ప్రిన్సిపాల్ నితిన్ పాఠక్, టీజీసీటీఏ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ సురేందర్ రెడ్డి, అదనపు పరీక్షల నియంత్రణ అధికారులు కరుణాకర్, డాక్టర్ మల్లారెడ్డి అకాడమిక్ సమన్వయకర్తలు పాల్గొన్నారు.


ఫలితాలు విడుదల చేస్తున్న ఎస్‌యూ పరీక్షల నియంత్రణ అధికారి సురేష్‌కుమార్

రాజీవ్‌గాంధీ సివిల్స్ అభయహస్తం గడువు పొడిగింపు



గోదావరిఖని, జూలై 9 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వ సూచన మేరకు సింగరేణి సంస్థ కార్పొరేట్ సామాజిక బాధ్యతలో భాగంగా ప్రారంభించిన రాజీవ్‌గాంధీ సివిల్స్ అభయ హస్తం దరఖాస్తుల స్వీకరణ గడువును ఈ నెల 12వ తేదీ వరకు పొడిగించినట్లు సింగరేణి సీఎండీ ఎన్ బలరాం బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్రం నుంచి సివిల్స్ ప్రిలిమ్స్‌లో పాసై మెయిన్స్‌కు హాజరవుతున్న అభ్యర్థులకు ఒక్కొక్కరికి లక్ష రూపాయల ఆర్థిక ప్రోత్సాహకాన్ని అందిస్తున్నట్లు వెల్లడించారు. దరఖాస్తుల గడువు తేదీ ఈ నెల 7తో ముగియగా ఈ నెల 12వ తేదీ వరకు పెంచుతూ నిర్ణయం తీసుకున్నట్లు వెల్లడించారు. అలాగే సివిల్స్ ప్రిలిమ్స్ పాసైన సింగరేణి ఉద్యోగుల పిల్లలకూ రూ.లక్ష చొప్పున ప్రోత్సాహకం అందించనున్నట్లు తెలిపారు.

ఇదీ నేపథ్యం..

గత ఏడాది రాష్ట్ర ముఖ్యమంత్రి ఏ రేవంత్‌రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మల్లు రాజీవ్ గాంధీ సివిల్స్ అభయ హస్తం పథకాన్ని ప్రారంభించారు. గతేడాది 140మంది అభ్యర్థులు దరఖాస్తు చేసుకోగా వీరికి ఒక్కొక్కరికి సింగరేణి సంస్థ లక్ష రూపాయల చొప్పున ప్రోత్సాహక నగదును అందజేసింది. వీరిలో 20మంది మెయిన్స్‌లోనూ పాసై ఇంటర్వ్యూకి ఎంపిక కాగా వారికి కూడా ఒక్కొక్కరికి లక్ష రూపాయల చొప్పున ప్రోత్సాహకాన్ని అందించింది. ఇదే విధంగా ఈ ఏడాది కూడా తెలంగాణ ప్రాంత అభ్యర్థులకు ఆర్థిక సహాయం అందించాలని నిర్ణయించింది.

వినియోగంలోకి పీకే రామయ్యకాలనీ ఆర్వో ప్లాంటు

జ్యోతినగర్, జూలై 9 (ఆంధ్రజ్యోతి): కొన్ని నెలలుగా ఎన్టీపీసీ ప్రభావిత ప్రాంతాలలో నిరుప యోగంగా ఉన్న ఆర్వో ప్లాంట్లను వినియోగంలో కి తెచ్చేందుకు నగర పాలక సంస్థ ముందుకు వచ్చింది. ఆర్వో ప్లాంట్ల మరమ్మతులకు ఎన్టీపీసీ 5.5 లక్షల రూపాయలను మంజూరు చేసింది. గతంలో ఎన్టీపీసీ సీఎస్ఆర్ నిధులతో పీకే రామ య్యకాలనీ, నర్రశాల పల్లి, సాయి సేవా సమితి తదితర కాలనీలో ఆర్వో ప్లాంట్లను నెలకొల్పారు. ప్లాంట్ల నిర్వహణ విషయంలో సమస్యలు ఎదురవ డంతో మూలనపడ్డాయి. నిధులు విడుదల చేయ డంతో పీకే రామయ్య కాలనీలోని ఆర్వో ప్లాంటుకు మరమ్మతులు చేసి బుధవారం వినియోగంలోకి తీసుకు వచ్చారు. మిగతా ప్లాంట్ల మరమ్మతు చేపడుతామని ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ రామన్, ఈ ఈ ఖాజా జమీల్ అహ్మద్ తెలిపారు.

జీవన స్థితిగతులపై సర్వే


సర్వే చేస్తున్న జాతీయ గణాంక శాఖ అధికారి శ్రీనివాస్, మున్సిపల్ ఉద్యోగులు

వేములవాడ, జూలై 9 (ఆంధ్రజ్యోతి) : ప్రజల జీవన స్థితిగతులను అధ్యయనం చేసే క్రమంలో జాతీయ గణాంక అధికారులు బుధవారం వేములవాడ పట్టణంలో సర్వే ప్రారంభించారు. ఉమ్మడి కరీంనగర్ జిల్లా వ్యాప్తంగా ఎంపిక చేసిన పట్టణాలు గ్రామాలలో ప్రజల ఉపాధి, స్థితిగతులపై నిర్వహిస్తున్న సర్వేలో భాగంగా వేములవాడ పట్టణంలో సర్వే ప్రారంభించామని జాతీయ గణాంక అధికారి గుర్రం శ్రీనివాస్‌గౌడ్ తెలిపారు. తొలుత సాధారణ వివరాలతో సర్వే చేసిన అనంతరం ప్రత్యేక ట్యాబ్ ద్వారా 12 కుటుంబాలను ఎంపిక చేసి మూడు నెలల పాటు నెలకు ఒకసారి పూర్తి సర్వే చేసి వివరాలను నమోదు చేస్తామన్నారు. ఇందులో కుటుంబ యజమాని పేరు, సభ్యుల వివరాలు, విద్యార్హతలు, వృత్తివిద్యా కోర్సులు, స్వయం ఉపాధి తదితర అంశాలు నమోదు చేస్తామని ఆయన తెలిపారు. కార్యక్రమంలో కమిషనర్ అన్వేష్, మేనేజర్ సంపత్‌రెడ్డి, తహసీల్దార్ విజయ ప్రకాశ్‌రావు, ఎంపీఎస్‌వో తిరుపతి, మున్సిపల్ బిల్ కలెక్టర్లు జ్యోతి, శ్రీనివాస్ పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

మండల వైద్యాధికారి అంజిత్‌రెడ్డి



ఆంధ్రజ్యోతి: వర్షాలకు వ్యాధులు రాకుండా ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలి ?

వైద్యాధికారి: వర్షాలతో వచ్చే కొత్త నీరుతో అతిసార ప్రబలే ప్రమాదముంది. సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి

ఆంధ్రజ్యోతి: ప్రజలను ఏవిధంగా అప్రమత్తం చేస్తున్నారు?

వైద్యాధికారి: గ్రామాల్లో ఇంటింటికీ వైద్య ఆరోగ్యశాఖ సిబ్బంది వెళ్లి పరిశుభ్రతపై అవగాహన కల్పిస్తున్నారు.

ఆంధ్రజ్యోతి: వైద్య శిబిరాలు ఏర్పాటు చేస్తున్నారా?

వైద్యాధికారి: గ్రామాల్లో వైద్య శిబిరాలు నిర్వహిస్తూ పరీక్షలు చేస్తూ అవసరమైన వారికి మందులు అందజేస్తున్నాం. తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరిస్తున్నాం.

-మెట్‌పల్లి రూరల్

దరఖాస్తుల ఆహ్వానం

మల్యాల, జూలై 9(ఆంధ్రజ్యోతి): మండలంలోని నూకపల్లి మోడల్‌స్కూల్‌లో ఖాళీగా ఉన్న సీట్ల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ ఒక ప్రకటనలో తెలిపారు. 6వ తరగతిలో 21 సీట్లు, 9వ తరగతిలో 4 సీట్లు ఖాళీగా ఉన్నాయని ఆసక్తి గల విద్యార్థులు దరఖాస్తులు చేసుకోవాలని కోరారు. వివరాలకు మోడల్‌స్కూల్‌లో సంప్రదించాలని సూచించారు.

ఉచిత పశువైద్య శిబిరం

మల్యాల, జూలై 9(ఆంధ్రజ్యోతి): మల్యాల వ్యవసాయ మార్కెట్ ఆధ్వర్యంలో మండలంలోని లంబాడిపల్లిలో బుధవారం ఉచిత పశువైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరంను చైర్‌పర్సన్ బత్తిని మల్లీశ్వరీశ్రీనివాస్ గౌడ్ ప్రారంభించగా వెటర్నరీ వైద్యులు ఆవులు, గొర్రెలకు వైద్య పరీక్షలు నిర్వహించి మందులు అందించారు. వర్షాకాలంలో పశువులకు తీసుకోవల్సిన జాగ్రత్తలను యజమానులకు అవగాహన కల్పించారు. వెటర్నరీ వైద్యులు రాజ్‌కుమార్, కమలాకర్, రాకేశ్, శ్రీనివాస్‌బాబు, కిషోర్‌తో పాటు మార్కెట్ కార్యదర్శి వరలక్ష్మి, సూపర్‌వైజర్ శ్రీదేవి, డైరెక్టర్లు జలంధర్, లింగన్న నాయకులు వెంకన్న, చంద్రయ్య, గంగారెడ్డి, ముత్యాల నర్సింహారెడ్డి పాల్గొన్నారు.

శాకంబరిగా సరస్వతీ అమ్మవారు

మల్యాల, జూలై 9(ఆంధ్రజ్యోతి): మండలంలోని నూకపల్లి అర్బన్ హౌజింగ్ కాలనీలో కొలువైన సరస్వతీ అమ్మవారు బుధవారం మూల నక్షత్రం పురస్కరించుకొని శాకంబరి అవతారంలో భక్తులకు దర్శనం ఇచ్చారు. ఈ సందర్భంగా వివిధ రకాలు కూరగాయలతో అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. వందలాదిగా భక్తులు అమ్మవారిని దర్శించుకొని పూజలు జరిపారు. ఆలయ ప్రధాన అర్చకులు కేతరాజు లక్ష్మినరసింహారావు, ఆలయ నిర్వహకులు ఎల్లాల గోపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

జిల్లా సమగ్ర అభివృద్ధికి కృషి

(ఐదో పేజీ తరువాయి)

అనుగుణంగా నిబంధనల మేరకు పని చేయాలని అధికారులకు సూచించారు. విధుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే తగిన చర్యలు తీసుకుం టామని మంత్రి అడ్లూరి అన్నారు.

ప్రభుత్వ మెడికల్ కళాశాలలో సౌకర్యాలు కల్పించాలి

-జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్ కుమార్



జగిత్యాల ప్రభుత్వ మెడికల్ కాలేజీలో అన్ని సౌకర్యాలు కల్పించాలని సిబ్బంది భర్తీకి చర్యలు తీసుకోవాలి. జగిత్యాల నియోజకవర్గంలో పెండింగ్‌లో ఉన్న ఆలయాల నిర్మాణ పనులు పూర్తి చేయాలి. అత్యంత పవిత్రమైన కొండగట్టు అంజనేయ స్వామి దేవస్థానంలో తాగునీటి సమస్య పరిష్కారానికి మంత్రి లక్ష్మణ్ కుమార్ చర్యలు తీసుకోవాలి. అధికారులు అభివృద్ధి విష యంలో నిష్పక్షపాతంగా వ్యవహరించాలి.

మన ఊరు- మన బడి నిధులు మంజూరు చేయించాలి

-కోరుట్ల ఎమ్మెల్యే కల్వకుంట్ల సంజయ్



గతంలో పెండింగ్ ఉన్న మన ఊరు-మన బడి కార్యక్రమానికి సంబంధించిన నిధులను మంత్రి లక్ష్మణ్ కుమార్ మంజూరు చేయించాలి. వర్షాకాలం నేపథ్యంలో మెట్‌పల్లి, కోరుట్ల మున్సిపల్ అధికారులు పట్టణాల్లో ప్రత్యేక చర్యలు తీసుకోవాలి. వరద డ్యామేజ్ పనులను సత్వరమే పూర్తి చేయాలని పేర్కొన్నారు. పెండింగ్‌లో ఉన్న ఆలయ ఆలయ నిర్మాణ పనులను అధికారులు సత్వరమే చేపట్టాలి. దేవాదాయ శాఖ అధికారులు బాధ్యతయుతంగా పనిచేయాలి.

డబుల్ బెడ్‌రూం ఇళ్ల వద్ద సౌకర్యాలు కల్పించాలి

-ఎమ్మెల్సీ ఎలగందుల రమణ



జగిత్యాలలో డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల వద్ద మౌలిక సౌకర్యాలు కల్పించాలి. జగిత్యాలలో కొత్త బస్టాండ్ నుంచి పాత బస్టాండ్ వరకు రోడ్డు వెడల్పు కార్యక్రమం చేపట్టాలి. జగిత్యాలలో డిగ్రీ కళాశాల ఏర్పాటు అయి 60 ఏళ్ల నిండిన నేపథ్యంలో వజ్రోత్సవాలు నిర్వహించి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని ప్రత్యేకంగా ఆహ్వానించాలి. కొండగట్టు అంజనేయస్వామి ఆలయ అభివృద్ధికి ప్రత్యేక చర్యలు తీసుకోవాలి.

ఈసందర్భంగా మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ మాట్లాడుతూ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీ సూచించిన అంశాలను తప్పకుండా పరిశీలించి అమలుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. జిల్లాలో రైతులకు ప్రజలకు ఎక్కడా ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అధికారులు అప్రమత్తంగా ఉండాలని, ఏ సమస్య వచ్చినా కలెక్టర్ దృష్టికి తీసుకురావాలని మంత్రి ఆదేశించారు. ఈ సమావేశంలో కలెక్టర్ సత్య ప్రసాద్, అదనపు కలెక్టర్ బీఎస్ లత, ఆర్డీఓ మధుసూదన్ జిల్లాస్థాయి అధికారులు పాల్గొన్నారు.

'ఫార్మర్ రిజిస్ట్రీ' అంతంతే...

(ఐదో పేజీ తరువాయి)

అధికారులు నొక్కి చెబుతున్నారు. రైతులు తప్పనిసరిగా ఫార్మర్ రిజిస్ట్రీ చేయించుకోవాలని అధికారులు సూచిస్తున్నారు.

● సాంకేతిక సమస్యలతో ఇబ్బంది

జిల్లాలో 34.38 శాతం ఫార్మర్ రిజిస్ట్రీ నమోదు పూర్తయిందని అధికారులు పేర్కొంటున్నారు. జిల్లాలో 71 క్లస్టర్లు ఉన్నాయి. క్లస్టర్‌కు ఓ వ్యవసాయ విస్తరణ అధికారి విధులు నిర్వహించగా, ఆయా గ్రామాలకు వెళ్లి ఫార్మర్ రిజిస్ట్రీ ప్రక్రియను కొనసాగిస్తున్నారు. చాలా చోట్ల సర్వర్లు మొరాయిస్తున్నాయని అధికారులు, రైతులు వాపోతున్నారు. రైతు భరోసా, పంట నమోదు, విత్తనాలు, ఎరువుల సరఫరా తదితర విషయాల్లో వ్యవసాయ విస్తరణ అధికారులు ఇప్పటికే బిజీ ఉండగా, కేంద్ర ప్రభుత్వం అదనంగా ఫార్మర్ రిజిస్ట్రీని తీసుకురావడంతో ఏఈవోలు తీవ్ర ఒత్తిడికి లోనవుతున్నారు. దీనికి తోడు సాంకేతిక సమస్యలతో ఇబ్బందులు ఎదురవుతున్నాయి.

నమోదుతో మేలు..

-భాస్కర్, జిల్లా వ్యవసాయ అధికారి



ఫార్మర్ రిజిస్ట్రీ ప్రక్రియ కొనసాగుతోంది. వ్యవసాయ పనులు ప్రారంభం కావడంతో రైతులు బిజీగా మారారు. వారు వీలు చూసుకొని వ్యవసాయ విస్తరణ అధికారులకు పట్టా పాస్ బుక్ జిరాక్స్, ఆధార్ కార్డు జిరాక్స్, మొబైల్ నంబర్‌తో ఫార్మర్ రిజిస్ట్రీ తప్పకుండా చేసుకోవాలి.

పొంచి ఉన్న ప్రమాదం.. పట్టించుకోని విద్యుత్ అధికారులు

ఇబ్రహీంపట్నం, జూలై9 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తిమ్మాపూర్ గ్రామంలో మెయిన్ రోడ్డు పక్కన గల వేప చెట్టు ప్రమాదకరంగా మారింది. చెట్టుకు ఒకవైపున 11 కేవీ విద్యుత్ తీగలు, మరో ప్రక్కన 11కేవీ తీగలు ఉన్నాయి. విద్యుత్ అధికారులకు ఎన్నిసార్లు విన్నవించినా ఆ చెట్టుకొమ్మలు కొట్టివేయడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. సంబంధిత అధికారులు స్పందించాలని స్థానికులు కోరుతున్నారు.



విద్యుత్ వైర్లపై ప్రమాదకరంగా ఉన్న చెట్టు

రైతులు పప్పుదినుసుల పంటలు సాగు చేయాలి

● మెట్‌పల్లి ఏఎంసీ చైర్మన్ కూన గోవర్ధన్

మెట్‌పల్లి రూరల్, జూలై 9 (ఆంధ్రజ్యోతి) : రైతులు పప్పుదినుసుల పంటలను సాగు చేయాలని మెట్‌పల్లి వ్యవసాయ మార్కెట్‌కమిటీ యార్డు చైర్మన్ కూన గోవర్ధన్ అన్నారు. బుధవారం మెట్‌పల్లి వ్యవసాయ కార్యాలయంలో రైతులకు కంది పప్పు విత్తనాలను అధికారులతో కలిసి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వ్యవసాయ సహాయసంచాలకులు రమేష్ మాట్లాడుతూ వానాకాలంలో రైతులు పప్పుదినుసు పంటలు సాగు చేయాలని దీని వలన భూమి సారవంతం అవుతుందన్నారు. మార్కెట్‌లో పప్పులకు డిమాండ్ ఉందని, రైతులంతా ఒకే పంట సాగుచేయకుండా పప్పు దినుసు పంటలపై దృష్టి సారించాలన్నారు. ఈ కార్యక్రమంలో మండలాధికారి దీపిక, సిబ్బంది, రైతులు, తదితరులు పాల్గొన్నారు.

గుంతలు ఇలా..పార్కింగ్ చేసేది ఎలా?

● గుంతలు తవ్వకంతో ఇబ్బందులు పడుతున్న క్రీడాకారులు



అంబేద్కర్ స్టేడియం ముందు పార్కింగ్‌లో తవ్విన గుంతలు

మెట్‌పల్లిటౌన్, జూలై9(ఆంధ్రజ్యోతి): అసలే అంతంత మాత్రం పార్కింగ్ అందులో గుంతాలు తవ్వి వదిలేయడంతో పట్టణ క్రీడాకారులకు పార్కింగ్ సమస్యలు తప్పడం లేదు. మెట్‌పల్లి పట్టణంలోని అంబేద్కర్ స్టేడియం ఆవరణలో 6 నెలల క్రితం పల్లె దవాఖానా భవన నిర్మాణం కోసం కాంట్రాక్టర్ గుంతలు తవ్వాడు. స్టేడియం పార్కింగ్ సంబంధించిన స్థలంలో పల్లె దవాఖానా నిర్మాణం చేపట్టవద్దని అథ్లెటిక్స్ అసోసియేషన్ సభ్యులతో పాటు, క్రీడాకారులు స్థానిక ఎమ్మెల్యే కల్వకుంట్ల సంజయ్‌కు విన్నవించారు. దీంతో స్పందించిన ఎమ్మెల్యే అక్కడ పల్లె దవాఖానా నిర్మాణం చేపట్టవద్దని ఆదేశాలు జారీ చేయడంతో పనులు నిలిపివేశారు. కానీ సదరు కాంట్రాక్టర్ పార్కింగ్ స్థలంలో గుంతలు తవ్వి వదిలేయడంతో క్రీడాకారులు వాహనాల పార్కింగ్‌కు ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా మున్సిపల్ అధికారులు స్పందించి గుంతాలను పూడ్చివేయాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.

గుంతలను పూడ్చివేయాలి..



స్టేడియంలో నిత్యం క్రీడా పోటీలు జరుగుతాయి. దాదాపుగా 60 మందికి పైగా క్రీడాకారులు పాల్గొంటారు. వీరితో పాటు ఉదయం వాకర్స్, వివిధ రకాల క్రీడాలు ఆడే యువకులు వస్తుంటారు. పార్కింగ్ స్థలంలో గుంతలు తవ్వడంతో వాహనాలు పార్క్ చేయాలంటే ఇబ్బందులు పడుతున్నాం. అధికారులు స్పందించి సమస్య పరిష్కరించాలి.

-ఏలేటి ముత్తయ్యరెడ్డి, జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి

ప్రొసీడింగ్స్ అందించిన ఎమ్మెల్యే

కోరుట్ల, జూలై 9 (ఆంధ్రజ్యోతి): కోరుట్లలోని 28వవార్డులో గల అన్నపూర్ణ దేవి ఆలయానికి కోరుట్ల ఎమ్మెల్యే కల్వకుంట్ల సంజయ్ బుధవారం ప్రొసీడింగ్ పత్రాన్ని అందించారు. బీఆర్ఎస్ రాజ్యసభ ఎంపీ కేఆర్ సురేష్ రెడ్డి నిధులు రూ.లక్షా 50వేల విలువ చేసే ప్రొసీడింగ్‌పత్రాన్ని ఆలయ కమిటీ సభ్యులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు ఎమ్మెల్యేను సన్మానించి, కృతజ్ఞతలు తెలిపారు.

పదోన్నతులు ఇవ్వాలి

-తపస్ మండల అధ్యక్షుడు ఏనుగు ఆదిరెడ్డి

కొడిమ్యాల, జూలై 9(ఆంధ్రజ్యోతి) : బదిలీల తర్వాతనె ఉపాధ్యాయులకు పదోన్నతులు ఇవ్వాలని తపస్ మండల అధ్యక్షుడు ఏనుగు ఆదిరెడ్డి ప్రభుత్వాన్ని కోరారు. బుధవారం మండలంలోని పలు పాఠశాలలో సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా తపస్ మండల అధ్యక్షుడు మాట్లాడుతూ పీఆర్సీని ప్రకటిస్తూ, బీఈడీ అర్హత కలిగిన ఉపాధ్యాయులకు ఎల్ఎఫ్ఎల్ హెచ్ఎం ప్రమోషన్ ఇవ్వాలన్నారు. 317 జీవోను రద్దుచేస్తూ, మోడల్ స్కూల్ ఉపాధ్యాయులకు 010 పద్దు కింద జీతాలు ఇవ్వాలన్నారు. సీపీఎస్ రద్దు చేసి, జీపీఎస్ ఇవ్వాలన్నారు. ఈ సభ్యత్వ నమోదు కార్యక్రమంలో తపస్‌నాయకులు రాజగంగయ్య, శ్రీని వాస్, కల్యాణ్, మన్మదరెడ్డి వివిధ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

దుబ్బరాజన్న ఆలయ రెనోవేషన్ కమిటీ సభ్యుల ప్రమాణ స్వీకారం

సారంగాపూర్, జూలై9 (ఆంధ్రజ్యోతి) : దుబ్బరాజన్న ఆలయ రెనోవేషన్ కమిటీ సభ్యుల ప్రమాణ స్వీకార కార్యక్రమం బుధవారం జరిగింది. ఈ కార్యక్రమానికి మాజీ మంత్రి జీవన్‌రెడ్డి హాజరై రెనోవేషన్ కమిటీ సభ్యులకు శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో ఆలయ ఈవో అనూష, ఆలయ చైర్మన్ పొరండ్ల శంకరయ్య, కమిటీ సభ్యులు కోండ్ర రాంచందర్‌రెడ్డి, వాసం శ్రీనివాస్, కొలపాక రవి, పంగ కిష్టయ్య, పిస్నెం సత్యానారాయణ, ఉరుమడ్ల పోశాలు, సూర సత్యానారాయణ, చెట్ల శేఖర్, మతలపేరం శంకర్, రంగు శంకర్, మానుక గంగమ్మ పాల్గొన్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కు పంపిణీలో అవకతవకలపై విచారణ చేయాలి

కొడిమ్యాల, జూలై9(ఆంధ్రజ్యోతి): సీఎంఆర్ఎఫ్ చెక్కు పంపిణీపై అధికారులు విచారణ చేయాలని మండల బీఆర్ఎస్ నాయకులు కోరారు. బుధవారం మండల కేంద్రంలో విలేకరుల సమావేశంలో బీఆర్ఎస్ కొడిమ్యాల పట్టణ అధ్యక్షుడు కొత్తూరి స్వామి, బీఆర్ఎస్ మండల యూత్ అధ్యక్షుడు గడ్డం లక్ష్మారెడ్డి, యువ నాయకుడు రాచకొండ చంద్రమోహన్ మాట్లాడుతూ చొప్పదండి ఎమ్మెల్యే అనుచరుడు అని చెప్పుకునే కేతిరెడ్డి జీవన్‌రెడ్డి కొద్ది నెలల క్రితం మండల కేంద్రానికి చెందిన రాజు అనే వ్యక్తికి సీఎంఆర్ఎఫ్ చెక్ మంజూరై రాజుకు చేరక పోవటంతో నాయకుల చుట్టు తిరిగాడన్నారు. రాజు చెక్ మరొక్కరు డ్రా చేసుకున్నారని తెలుసుకొని ఎమ్మెల్యే, అధికారులకు చెప్పటానికి సిద్ధపడ్డాడన్నారు. దీంతో నాయకుడు లబ్దిదారుని ఇంటికి వెళ్లి 34వేల రూపాయల నగదు ఇస్తూ ఎవరికీ చెప్పవద్దన్నాడని తెలిపారు. ఈ విషయమై జీవన్‌రెడ్డిని వివరణ కోరగా ఒకే పేరు మీద చెక్ రావటంతో సమస్య తలెత్తిందన్నారు. బాధితులకు నష్టం జరుగకుండా ఆతని పేరున మంజూరైన మొత్తాన్ని ఇచ్చానన్నారు.

నేడు బీఆర్ఎస్ పార్టీ కార్యాలయం ప్రారంభోత్సవం

మల్లాపూర్, జూలై 9 (ఆంధ్రజ్యోతి) : మల్లాపూర్‌లో గురువారం బీఆర్ఎస్ పార్టీ కార్యాలయం ప్రారంభోత్సవాన్ని విజయవంతం చేయాలని పార్టీ మండలాధ్యక్షుడు తోట శ్రీనివాస్ అన్నారు.

జర్నలిస్టుల సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉంది

-మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్



మాట్లాడుతున్న మంత్రి లక్ష్మణ్ కుమార్

జగిత్యాల, జూలై 9 (ఆంధ్రజ్యోతి): పాత్రికేయుల సంక్షేమం కోసం రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ అన్నారు. బుధవారం జగిత్యాల జిల్లా తెలంగాణ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్ ఆర్గనైజేషన్ జిల్లా తృతీయ మహాసభలకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈసందర్భంగా మంత్రి మాట్లాడుతూ త్వరలో జర్నలిస్టులకు ఇంటి స్థలాలు ఇస్తామని హామీ ఇచ్చారు. అంతకుముందు జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ మాట్లాడుతూ జిల్లా కేంద్రంలో విలేకరులకు ఇంటి స్థలాలు ఇచ్చేందుకు కృషి చేస్తామన్నారు. కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ మాట్లాడుతూ కోరుట్ల నియోజక వర్గంలో ఇప్పటికే పాత్రికేయులందరికీ ఇంటి స్థలాలు ఇచ్చామని రాని వారికి కూడా త్వరలో అందించే ఏర్పాటు చేస్తామన్నారు. ఎమ్మెల్సీ రమణ మాట్లాడుతూ విలేకరులకు కావాల్సిన అన్ని సౌకర్యాలు కల్పించేందుకు కృషి చేస్తాననన్నారు. కార్యక్రమంలో ఐజేయూ జాతీయ కార్యవర్గ సభ్యులు, టీయూడబ్ల్యూజే రాష్ట్ర మాజీ అధ్యక్షుడు నగునూరి శేఖర్, టీయూడబ్ల్యూజే రాష్ట్ర అధ్యక్షులు విరాహత్ అలీ, కార్యదర్శి రాంనారాయణ ఉపాధ్యక్షులు బుర్ర సంపత్ కుమార్‌గౌడ్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు సురెందర్ కుమార్, ఎలగందుల రవీందర్, కరీంనగర్ జిల్లా అధ్యక్షుడు గాండ్ల శ్రీనివాస్, రాష్ట్ర నాయకులు టివి సూర్యం, జగిత్యాల జిల్లా అధ్యక్షుడు చీటి శ్రీనివాసరావు, కార్యదర్శి అల్లునూరి ప్రదీప్ పాల్గొన్నారు.

టీయూడబ్ల్యూజే (ఐజేయూ) జిల్లా అధ్యక్షుడిగా చీటి శ్రీనివాసరావు



విజయ సంకేతం చూపుతున్న శ్రీనివాసరావు తదితరులు

జగిత్యాల, జూలై 9 (ఆంధ్రజ్యోతి): టీయూడబ్ల్యూజే (ఐజేయూ) జిల్లా అధ్యక్షుడిగా చీటి శ్రీనివాసరావు రెండోసారి ఎన్నికయ్యారు. బుధవారం ఎన్నికలు జరగగా చీటి శ్రీనివాసరావుకు 262, బండ స్వామికి 189 ఓట్లు రాగా 73 ఓట్ల మెజారిటీతో గెలుపొందినట్టు ఎన్నికల అధికారి రవీందర్ తెలిపారు. కార్యదర్శిగా సంపూర్ణాచారికి 196 ఓట్లు, కోశాధికారిగా సిరిసిల్ల వేణుగోపాల్ 243 ఓట్లతో గెలుపొందారు. జిల్లాలో 523 ఓట్లకు 454మంది ఓటు హక్కును వినియోగించుకున్నారు. జాతీయ కార్యవర్గ సభ్యులు నగునూరి శేఖర్, గాండ్ల శ్రీనివాస్, బుర్ర సంపత్‌కుమార్ ఎన్నికల అధికారులుగా వ్యవహరించారు.

అభివృద్ధికి దూరంగా శివారు కాలనీలు

-ఇబ్బందులు పడుతున్న పట్టణవాసులు -వార్డుల పునర్విభజన చేసి సమస్యలు పరిష్కరించాలని వినతి

రాయికల్, జూలై 9 (ఆంధ్రజ్యోతి): జనాభాకు అనుగుణంగా వార్డులు లేకపోవడంతో శివారు కాలనీల ప్రజలు అభివృద్ధికి దూరంగా ఉంటూ అవస్థలు పడుతున్నారు. మురికి కాలువలు లేకపోవడం, చెత్తాచెదారం పేరుకుపోవడంపై శివారు కాలనీల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రాయికల్ మున్సిపాలిటీలో జనాభాకు అనుగుణంగా వార్డుల విభజన లేక ఇబ్బందిగా మారింది. జిల్లాలో 2019లో మేజర్ పంచాయతీగా ఉన్న రాయికల్, ధర్మపురి పట్టణాలను మున్సిపాలిటీలుగా ఏర్పాటు చేశారు. 2011 జనాభా లెక్కల ప్రకారం సుమారు 16 వేల జనాభా ఉండగా, 12 వేల ఓటర్లు ఉంటే రాయికల్ పట్టణాన్ని కేవలం 12 వార్డులుగా విభజించారు. ధర్మపురిలో ఇంతకన్నా తక్కువ జనాభా ఉన్నా పాలనాపరంగా ఇబ్బందులు లేకుండా 15 వార్డులు ఏర్పాటు చేశారు. రాయికల్ పట్టణంలో గతంలో 16 వేల జనాభా ఉండగా, ప్రస్తుతం సుమారు 19,985 జనాభా, 5456 గృహాలు ఉన్నాయి. సుమారు 12,526 ఓటర్లు ఉన్నారు. ఒక్కో వార్డులో కనిష్ఠంగా 850 మంది ఓటర్లు తగ్గకుండా వార్డుల విభజన చేపట్టాల్సి ఉండగా, రాయికల్ మున్సిపాలిటీలో 15కు బదులు కేవలం 12 వార్డులను మాత్రమే ఏర్పాటు చేశారు. దీంతో ఒక్కో వార్డులో జనాభా ప్రాతిపదికన నిధులు, ఇతర అభివృద్ధి పనులు చేపట్టకపోవడంతో శివారు కాలనీలు అభివృద్ధికి దూరమయ్యాయి. పట్టణంలోని ఇందిరానగర్, కుమ్మరిపెల్లి ప్రాంతంలోని తుర్క కాశీనగర్, రామాజీపేట శివారులోని గడ వంశస్థుల ఏరియా ప్రాంతాలు ఇతర వార్డుల్లో ఉండటంతో నిధుల కేటాయింపులో తాత్సారం జరుగుతోంది. పెరిగిన ఓటర్లు, జనాభా ప్రాతిపదికన విభజన చేపట్టి వార్డులను పెంచాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.



శివారు కాలనీలో డ్రైనేజీ లేక రోడ్డుపై పారుతున్న మురుగునీరు

అధ్వానంగా శివారు ప్రాంతాలు

-కుర్మ మల్లారెడ్డి, రాయికల్



రాయికల్ పట్టణంలో ఒక వార్డులో 800, కొన్ని వార్డులలో 1250 మంది ఓటర్లు ఉన్నారు. జనాభాకు అనుగుణంగా కాలనీల అభివృద్ధికి వార్డుల సంఖ్యను పెంచాలి. పట్టణంలో శివారు కాలనీల్లో అభివృద్ధికి నిధులు లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు.

నిధులు కేటాయిస్తేనే...

-తురగ శ్రీధర్ రెడ్డి, మాజీ కౌన్సిలర్



ధర్మపురి పురపాలిక మాదిరి 15 వార్డులను ఏర్పాటు చేయాలి. జనాభా, ఓటర్ల ప్రాతిపదికన పాలనాపరంగా నూతన వార్డుల ఏర్పాటు, విభజనతో కాలనీలు, అభివృద్ధి చెందుతాయి. నిధుల కేటాయింపుతో శివారులోని కాలనీల్లో సమస్యలు పరిష్కారమవుతాయి.

స్థానిక ఎన్నికలకు సిద్ధం కావాలి

కథలాపూర్, జూలై 9 (ఆంధ్రజ్యోతి) : వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో మెజారిటీ సీట్లు బీజేపీ సాధించుకునేందుకు శ్రేణులు సిద్ధంగా ఉండాలని మండల బీజేపీ అధ్యక్షుడు మల్యాల మారుతి కోరారు. బుధవారం మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో సీనియర్ నాయకులతో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా బీజేపీ కిసాన్ మోర్చా జిల్లా అధ్యక్షుడు కొడిపల్లి గోపాల్‌రెడ్డి, మాజీ మండల అధ్యక్షుడు రాచమడుగు వెంకటేశ్వర్‌రావు, వినోద్‌రెడ్డి, మహేశ్, సత్యం, నరెడ్ల రవి తదితరులు ఉన్నారు.

నియామకం

కథలాపూర్, జూలై 9 (ఆంధ్రజ్యోతి) : మండల బీజేవైఎం అధ్యక్షుడిగా చింతకుంటకు చెందిన ఆరె శివను నియమించినట్లు మండల అధ్యక్షుడు మల్యాల మారుతి తెలిపారు. ఈ మేరకు జిల్లా స్థాయి నాయకులు నియమిస్తూ ఉత్తర్వులు జారీ కాబడ్డాయన్నారు. యువమోర్చా విభాగం ప్రధాని నరేంద్రమోదీ అమలు చేస్తున్న పథకాలను ప్రజలకు వివరించాలని అన్నారు. శివ నియామకం పట్ల మండల నాయకులు వెంకటేశ్వర్‌రావు, మహేశ్, నరెడ్ల రవి హర్షం వెలిబుచ్చారు.

కుక్కల స్వైర విహారం

● బెంబేలెత్తుతున్న చిన్నారులు



వెల్లుల్ల ప్రధాన రహదారిపై సంచరిస్తున్న కుక్కలు

మెట్‌పల్లి రూరల్, జూలై 9 (ఆంధ్రజ్యోతి) : మెట్‌పల్లి మండలంలోని వెల్లుల్ల గ్రామంలో కుక్కల స్వైర విహారం చేయడంతో ప్రజలు జంకుతున్నారు. గ్రామంలోని ప్రధాన రహదారిపై గుంపులుగా కుక్కలు తిరుగుతుండంతో చిన్నారులు బయటకు వెళ్లాలంటే భయపడుతున్నారు. పలు సందర్భాల్లో కుక్కల దాడుల్లో చిన్నారులు ప్రమాదాలకు గురైన సంఘటనలు ఉన్నాయి. మెట్‌పల్లి పట్టణానికి రావడానికి పోవడానికి వెల్లుల్ల గ్రామం ప్రధాన రహదారి గుండా పోవాలి. ప్రతి నిత్యం వందల సంఖ్యలో వాహనాలు నడుస్తుంటాయి. కుక్కలు స్కూళ్లకు వెళ్లి వచ్చే సమయంలో పిల్లలపై దాడులు చేస్తున్నాయని గ్రామస్థులు పేర్కొంటున్నారు. అధికారులు స్పందించి కుక్కల బెడద నివారణకు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

కుక్కల బెడదను అరికట్టాలి

-మారు శ్రీనివాస్‌రెడ్డి, వెల్లుల్ల గ్రామం



గ్రామంలోని ప్రధాన కూడలి వద్ద మా ఇల్లు ఉంది. కుక్కలు ఎక్కువగా ఉండడంతో పిల్లలు స్కూల్‌కు పోవడానికి భయపడుతున్నారు. అధికారులు కుక్కల బెడదను అరికట్టాలి.

బోనాలు ఉత్సవాలు

కోరుట్ల, జూలై 9 (ఆంధ్రజ్యోతి): కోరుట్ల పట్టణంలోని భీముని దుబ్బలో గల సాయి జీనియస్ ఉన్నత పాఠశాలలో బుధవారం బోనాలు ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. పాఠశాలలో అమ్మవారికి బోనాలు సమర్పించారు. పాఠశాల కరస్పాండెంట్ చౌకీ రమేష్, ప్రిన్సిపాల్ చౌకీ సుధ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

●రాయికల్, జూలై 9 (ఆంధ్రజ్యోతి): రాయికల్ పట్టణంలోని కృష్ణవేణి టాలెంట్ స్కూల్‌లో బోనాలు పండుగ నిర్వహించారు. కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ తిరుపతి రావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలి

జగిత్యాల అర్బన్, జూలై 9 (ఆంధ్రజ్యోతి): జగిత్యాల పట్టణంలో పారిశుధ్యం, పచ్చదనం ప్రజల సహకారంతోనే సాధ్యం అవుతుందని జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ అన్నారు. బుధవారం జగిత్యాల పట్టణంలోని పలు వార్డులలో కోటి రూపాయలతో నిర్మించనున్న సిసి రోడ్లకు భూమి పూజ చేశారు. కార్యక్రమంలో కోరుట్ల నియోజక వర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి జువ్వాడి నర్సింగారావు, మున్సిపల్ కమీషనర్ స్పందన, మాజీ మున్సిపల్ చైర్మన్ అడువాల జ్యోతి, గిరి నాగభూషణం, అడువాల లక్ష్మణ్, చెటిపెల్లి సుధాకర్, దయాళ శంకర్ పాల్గొన్నారు.

మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి

వెల్గటూర్, జులై 8 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తరువాత మహిళలకు అన్ని రంగాలలో పెద్ద పీట వేస్తోందని ఏపీఎం చంద్రకళ పేర్కొన్నారు. మండలంలో బుధవారం ఇందిరా మహిళాశక్తి సంబరాలు నిర్వహించారు.

●ఇబ్రహీంపట్నం: మండలంలో గ్రామ ఐక్య సంఘాల ఆధ్వర్యంలో బుధవారం ఇందిరా మహిళా శక్తి సంబరాలను ఘనంగా జరుపుకున్నారు. ఇబ్రహింపట్నం ఏపియం శంకర్‌ను గ్రామ సంఘాల తరఫున సన్మానించారు. మన కమ్యూనిటీ కోఆర్డినేటర్లు, గ్రామంలోని మహిళలు గ్రామ సంఘ అసిస్టెంట్లు పాల్గొన్నారు.